
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 20 నవంబరు 2024



విజ్ఞానాలయాలు.. విలవిల

విజ్ఞానాలయాలుగా విలసిల్లుతున్న గ్రంథాలయాలు.. నిధులు రాక, నిర్వహణ లేక విలవిలలాడుతున్నాయి. వివిధ రకాల గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు లేక, పాఠకుల ఆదరణ కోల్పోయి వెలవెలపోతున్నాయి. వందలాది మంది పాఠకులతో కళకళలాడే గ్రంథాలయాలు నేడు కునారిల్లిపోతున్నాయి. నిధుల కొరతతో.. మారుతున్న కాలానికి అనుగుణంగా నవీకరణకు నోచుకోలేక గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఉన్న లైబ్రరీలు గత వైభవం కోసం ఎదురుచూస్తున్నాయి. ఉద్యోగార్థులకు కావాల్సిన పుస్తకాలను అందించడంతో పాటు జ్ఞాన సముపార్జనకు వచ్చే పలువురికి అరకొర సౌకర్యాలే స్వాగతం పలుకుతుండడంతో గ్రంథాలయాలకు వచ్చేవారి సంఖ్య రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. గడచిన ఐదేళ్లలో ఒక్క పుస్తకం కొనుగోలుకు కానీ, భవనాల మరమ్మతులకు కానీ ఒక్క రూపాయి వెచ్చించలేదంటే గ్రంథాలయాలపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఏరీతిన ఉందో తెలుసుకోవచ్చు. స్థానిక సంస్థల నుంచి హక్కుగా రావాల్సిన సెస్సు కూడా ఏళ్ల తరబడి జమ కాకపోవడంతో కోట్ల రూపాయలు బకాయిలు వెక్కిరిస్తున్నాయి. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పాఠకుల కోసం గ్రంథాలయాల సమస్యలపై ప్రత్యేక కథనం.


చిలకలూరిపేట గ్రంథాలయంలో అరకొరగా ఉన్న పాఠకులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఆధునికతకు.. ఆపసోసాలు

అవే పత్రికలు, పుస్తకాలు తప్ప డిజిటలైజేషన్ వైపు పకడ్బందీగా అడుగులు వేయలేక గ్రంథాలయాలు ఆపసోపాలు పడుతున్నాయి. ఇంటర్నెట్ వినియోగం పెరిగిపోతున్న తరుణంలో గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అయితే ఇందుకోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. గ్రేడ్-1, 12 గ్రేడ్-2 శాఖా గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేయాలని గతంలో అధికారులు సంకల్పించగా ఆ ప్రయత్నం ముందుకు సాగడంలేదు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 20 కంప్యూటర్లతో ఎయిర్ కండీషనింగ్ చేయించినా పాఠకులకు ఉచిత సేవలు అరకొరగానే లభిస్తున్నాయి.

ఆదర్శంగా వినుకొండ

2007వ సంవత్సరం నుంచి మొదలుకొని పల్నాడు జిల్లా పరిధిలోని వినుకొండ మున్సిపాలిటీ క్రమం తప్పకుండా సెస్సు చెల్లిస్తున్నది. రూ.1.63 కోట్ల గ్రంథాలయ సెస్సుకు మొత్తం డిమాండ్ చెల్లించింది. వినుకొండ మున్సిపాలిటీని ఆదర్శంగా తీసుకుని సెస్సు బకాయిలు లేకుండా అన్ని పురపాలక సంఘాలు, పంచాయతీలు, ఏపీఐఐసీ చెల్లిస్తే పాఠకులకు అధునాతన సౌకర్యాలను గ్రంథాలయాల్లో కల్పించొచ్చు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో గ్రంథాలయాలు కునారిల్లిపోయాయి.



(ఆంధ్రజ్యోతి - పల్నాడు, న్యూస్‌నెట్‌వర్క్)

పలు దినపత్రికలు, గ్రంథాలు, పోటీ పరీక్షల పుస్తకాలు.. వాటిని చదువుకునేందుకు వచ్చే పాఠకులతో గ్రంథాలయాలు కళకళలాడుతుండేవి. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయిలో గ్రంథాలయాలకు పెద్ద ఆదరణ ఉండేది. ప్రభుత్వంతో పాటు గ్రంథకర్తలు, సాహితా సంస్థల ప్రోత్సాహంతో గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా విలసిల్లేవి. ఎందరికో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు రావడానికి కారణమయ్యాయి. అలానే సాహితీవేత్తలను తయారు చేశాయి. అలాంటి గ్రంథాలయాలు గత కొంతకాలంగా నిధులు లేక, పలు రకాల సమస్యలను పరిష్కరించే దిక్కు లేక, ఎవరికీ పట్టనట్లుగా ఉంటున్నాయి. ప్రభుత్వాలు గ్రంథాయాలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయి. ప్రభుత్వం గ్రంథాలయాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించకపోగా ప్రజల నుంచి వసూలు చేస్తున్న సెస్సులను స్థానిక సంస్థలు దారి మళ్లిస్తున్నా పట్టించుకోవడంలేదు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ గ్రంథాలయాలకు జమ చేయకుండా జాప్యం చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం సీఎఫ్ఎంఎస్ విధానం కారణంగా కనీసం స్టేషనరీ సామాగ్రిని కూడా కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా 97 శాఖా గ్రంథాయాలు, 32 గ్రామీణ, 103 పుస్తక పంపిణీ కేంద్రాలున్నాయి. ఆయా గ్రంథాలయాల్లో 10,52,370 పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. గుంటూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 51,862 పుస్తకాలు ఉండగా వాటిలో చాలావరకు కాలం చెల్లినవే. అప్‌డేట్ అయినవి చాలా తక్కువగా ఉన్నాయి. వివిధ రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అవసరం మేరకు అందుబాటులో లేవు. రీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలను తెప్పించడంలో జాప్యం జరుగుతున్నది. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్కటంటే ఒక్క పుస్తకం కొత్తగా కొని పాఠకులకు అందుబాటులో ఉంచలేదు. డీఎస్సీ, టెట్, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యే ఉద్యోగార్థులకు కావాల్సిన ఏ ఒక్క మెటీరియల్ కూడా గ్రంథాలయాల్లో అందుబాటులో లేదు. గ్రంథాలయాల్లో భర్తీ కావాల్సిన పోస్టులు అయితే పదుల సంఖ్యలోనే ఉన్నాయి. చాలా చోట్ల అవుట్ సోర్సింగ్ విధానంతోనే నడిపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో అయినా గ్రంథాలయాలను గాడిన పెట్టే విధంగా చర్యలు తీసుకోవడంతో పాటు బకాయిల వసూలుపై దృష్టి పెట్టి ఆ నిధులను వాటి అభివృద్ధిపై ఖర్చు పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతుండడంతో ఆర్భాటపు ప్రకటనలకే పరిమితం కాకుండా అమలు జరిగే పనులకు పూచీ ఇచ్చి వాటిని ఆచరణలోకి తేవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



- ఆదరణ లేక గ్రంథాలయాలు వెలవెల
- ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యం
- అరకొర పుస్తకాలతోనే పరిమితంగా సేవలు
- లైబ్రరీలకు సెస్సులు చెల్లించని స్థానిక సంస్థలు
- కూటమి ప్రభుత్వంలో పూర్వ వైభవం రావాలని ఆశ

సెస్సుల జమలో నిర్లక్ష్యం

ప్రజలు చెల్లించే ఆస్తి పన్నులో 8 శాతం సెస్సు కింద ఎక్కడికక్కడ ఉండే గ్రంథాలయాల ఖాతాల్లో జమ చేయాలి. ఈ నిధుల్ని గ్రంథాలయాల అభివృద్ధికి మాత్రమే వెచ్చించాలని నిబంధనలున్నాయి. గడచిన ఐదేళ్లలో సెస్సు మొత్తాలను లైబ్రరీ ఖాతాలకు జమ చేయకపోగా ఆ నిధులను దారి మళ్లించేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పురపాలకసంఘాలు, పంచాయతీలు, కార్పొరేషన్‌లు, ఏపీఐఐసీ నుంచి గ్రంథాలయాలకు సెస్సు బకాయిలు రావాలి. 2007-08 నుంచి రూ.42 కోట్ల పైచిలుకు సెస్సు బకాయిలు పేరుకుపోయి ఉన్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కార్పొరేషన్ల నుంచి రూ.8.08 కోట్లు, మున్సిపాలిటీల నుంచి రూ.3.97 కోట్లు, పంచాయతీల ద్వారా రూ.3.16 కోట్లు, ఏపీఐఐసీ నుంచి రూ.75,90,733 కలిపి మొత్తంగా రూ.15 కోట్ల 99 కోట్ల సెస్సు రావాలి. అయితే ఇప్పటివరకు రూ.9.02 కోట్లు మాత్రమే వసూలైంది. ఇంకా రూ.6.96 కోట్లు వసూలు కావాల్సి ఉన్నది. బాపట్ల పురపాలక సంఘం నుంచి రూ.30.44 లక్షల బకాయి రావాల్సి ఉండగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. చిలకలూరిపేట నుంచి రూ.37.63 లక్షలు, మాచర్ల నుంచి రూ.19.11 లక్షలు, పిడుగురాళ్ల నుంచి రూ.29.18 లక్షలు, గురజాల నుంచి రూ.4.43 లక్షలు, దాచేపల్లి నుంచి రూ.8.48 లక్షల్లో రూపాయి కూడా వసూలు జరగలేదు. 1017 పంచాయతీల్లో రూ.3.16 కోట్లు డిమాండ్ ఉంటే అందులో సగం మాత్రమే జమైంది. ఏపీఐఐసీ నుంచి రూ.75.90 లక్షలు రావాల్సి ఉండగా ఒక్క రూపాయి విడుదల కాలేదు. ఇలా సెస్సు బకాయిలు పేరుకుపోతుండటంతో గ్రంథాలయాల నిర్వహణపై భారం పడుతున్నది.

అరకొర పుస్తకాలు..

మాచర్లటౌన్: మాచర్లలోని గ్రంథాలయంలో టెట్, డీఎస్సీ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు లేవు. గ్రంథాలయంలో 16 వేల పుస్తకాలు దాకా ఉన్నాయి. రూ.13 లక్షల పైచిలుకు సెస్ బకాయి ఉంది.

అద్దె భవనంలోనే..



వినుకొండ: వినుకొండలోని గ్రంథాలయం దశాబ్దాలుగా అద్దె భవనంలో కొనసాగుతుంది. వర్షం వచ్చినప్పుడల్లా నీరు చేరడంతో పాఠకులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికీ పాత ఫర్నిచర్‌తోనే కొనసాగుతుంది.

ఇరుకు గదిలోనే..

పిడుగురాళ్ల: పట్టణశాఖ గ్రంథాలయం 15 ఏళ్లగా అద్దె భవనంలోనే నడుస్తుంది. పిడుగురాళ్ల మున్సిపాల్టీగా అవతరించి పదేళ్ల అవుతున్నా గ్రంథా లయం మాచర్ల బస్టాండ్ సెంటర్‌లో ఇరుకైన అద్దె భవనంలోనే కొనసాగుతుంది. కొత్తవారికైతే గ్రంథా లయం ఎక్కడుందో వెతికేందుకే కొంత సమయం పడుతుంది. వార్త పత్రికలు, వీక్లీ పత్రికలు, కొన్ని పాత నవలలు మినహా మరేవీ అందుబాటులో లేవు. ఇరుకైన గదులు పాఠకులకు అసౌకర్యంగా ఉన్నాయి.





చిలకలూరిపేట: చిలకలూరిపేట శాఖ గ్రంథాలయానికి రూ.3.12 కోట్ల మేర సెస్ బకాయిలు ఉన్నాయి. పేరుకుపోయిన బకాయిల కారణంగా గ్రంథాలయం పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు తేళ్ళ సుబ్బారావు టెట్, డీఎస్సీ పరీక్షల పుస్తకాలు విరాళంగా అందచేశారు. 30 వేల పుస్తకాలు ఉన్న ఈ గ్రేడ్ వన్ గ్రంథాలయానికి మూడేళ్లుగా గ్రంథాలయ అధికారి నియామకం జరగలేదు.

దాతల సహకారం..

వసతులు అంతంత మాత్రమే



నరసరావుపేట: నరసరావుపేటలోని శాఖా గ్రంథాలయంలో వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మరుగుదొడ్ల వసతి లేదు. ఇంటర్నెట్ సౌకర్యం కూడా కల్పించలేదు. పాత పల్నాడు బస్టాండ్‌లోని గ్రంథాలయ భవనానికి అద్దెల ఆదాయం సమకూరుతుంది. అయితే సౌకర్యాలు సక్రమంగా లేవు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

- 'తేమ' పరీక్షలో చిత్తవుతున్న పత్తి రైతు
- అమ్మకాల కోసం రోజుల తరబడి నిరీక్షణ
- తిరస్కరించిన లోడ్‌ను తిరిగి తీసుకెళ్లడం అదనపు భారం


పత్తిలో తేమ శాతం చూస్తున్న అధికారులు



గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులు.. సీసీఐ నిబంధనలు.. పత్తిని అమ్ముకునే రైతులకు అగ్నిపరీక్షలుగా మారుతున్నాయి. మద్దతు ధర దక్కుతుందనుకున్న సీసీఐ కేంద్రాల్లో చిత్ర, విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఎండ వేడి ఎక్కువగా ఉన్న ఉదయం వేళ తీసుకువస్తున్న పత్తి లాట్‌లు సీసీఐ తేమ పరీక్షలో నెగ్గుతున్నాయి. సాయంత్రం తీసుకువస్తున్న పత్తి లాట్లలో తేమ శాతం నిబంధనలకు మించి ఉండటంతో తిరస్కరిస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో పత్తి కొనుగోలు కోసం రైతులు ఒకటి, రెండు రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంటోంది. అప్పటికీ కూడా తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొనుగోలు చేయకపోతుండటంతో ఉసూరుమంటూ వెళ్లిపోతున్నారు.

యంత్రాల్లో తేడా...

ప్రస్తుతం సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం చూసేందుకు బయ్యర్లు రెండు రకాల యంత్రాలు వినియోగిస్తున్నారు. వాటిలో ఒక్కో దానిలో ఒక్కో తేమ శాతం కనిపిస్తుంది. చిన్న ముళ్ళు ఉన్న యంత్రంలో 12 శాతం తేమ ఉన్నట్లు చూపిస్తుంటే, పెద్ద ముళ్ల ఉన్న యంత్రంలో 15 శాతం ఉన్నట్లు

(మిగతా 6లో)

సంక్షేమ పథకాల సత్వర అమలుకు ప్రణాళికలు సిద్ధం

● ఏపీ మాదిగ సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ సంస్థ ఛైర్ పర్సన్ శ్రీదేవి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి


గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో షెడ్యూల్ కులాల సంక్షేమ పథకాలకు కేటాయించిన నిధుల్లో సంక్షేమ పథకాలు సత్వర అమలు కోసం ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్ మాదిగ సంక్షేమ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ సంస్థ ఛైర్‌పర్సన్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. తాడేపల్లిలోని కార్యాలయంలో మంగళవారం సంస్థ సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ సిబ్బంది అంకిత భావంతో పని చేసి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. సంక్షేమ పథకాల అమల్లో నిర్లక్ష్యం చేస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ కే కృష్ణవేణి, కార్యనిర్వహణ అధికారులు మంగారావు, కామేశ్వరరావు, ప్రసాద్ ఉన్నారు.

వైసీపీలో ఇంకా మార్పు రాలేదు: కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీని 11 సీట్లుకే పరిమితం చేసినప్పటికీ వారి వైఖరిలో ఎటువంటి మార్పు రాలేదని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వృద్ధిరేటులో కూటమి ప్రభుత్వం కంటే జగన్ ప్రభుత్వంలోనే ఎక్కువగా ఉందన్న అసత్య ప్రచారం చేస్తున్నారని అన్నారు. వృద్ధిరేటు పెరగాలంటే కొత్తగా పరిశ్రమలు తీసుకువచ్చి ఆదాయ మార్గాలను పెంపొందించాలని, వైపీపీ హయాంలో కొత్తగా తీసుకు వచ్చిన పరిశ్రమలు ఏం ఉన్నాయో చెప్పాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలను, ఐటీ కంపెనీలను పంపించి వేసినందుకా వృద్ధిరేటు పెరిగిందని ఎద్దేవా చేశారు.

నదుల అనుసంధానంతో రాష్ట్రం సస్యశ్యామలం

● పోలవరం, జలవనరుల ప్రాజెక్టులపై అసెంబ్లీలో మాట్లాడిన చీఫ్ విప్ జీవీ



అసెంబ్లీలో మాట్లాడుతున్న జీవి ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పోలవరం ప్రాజెక్టును నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామల చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా, కరువు రహితంగా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎట్టిపరిస్థితుల్లోనూ పోలవరం ప్రాజెక్టును, వినుకొండ ప్రాంతానికి కీలకమైన బొల్లాపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తుందని అన్నారు. గోదావరి, పెన్న నదుల అనుసంధానంతో గుంటూరు, ప్రకాశం, రాయలసీమను సస్యశ్యామలం అవుతాయని అన్నారు. గడచిన ఐదేళ్లలో జగన్‌రెడ్డి చేసినంత ద్రోహం రైతులకు ఎవరు చేయలేదని, 2014-2019 మధ్య మొత్తం రూ.7లక్షల కోట్ల బడ్జెట్‌లో సాగునీటి రంగానికి రూ.68293 కోట్లు ఇచ్చి 62 ప్రాజెక్టులకు పనులు మొదలు పెట్టారన్నారు. అందులో 23 ప్రాజెక్టులు పూర్తి చేసిన ఘనత కూడా నాడు చంద్రబాబునాయుడుకే దక్కిందని అన్నారు. తద్వారా 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ, 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తీసుకురావడం జరిగిందని చెప్పారు. జగన్ హయాంలో సాగునీటికి కేవలం రూ.34 వేల కోట్లు ఖర్చు చేశారని, అందులో జీతాలకే రూ.10 వేల కోట్లు పోయాయన్నారు. దీని ఫలితంగానే రాష్ట్రంలో సాగునీటి రంగం అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు రివర్స్ టెండరింగ్ పేరుతో సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 71 శాతం ప్రాజెక్టులను పూర్తిచేస్తే జగన్ తనహయాంలో కేవలం 4.8 శాతం మాత్రమే చేయగలిగారని విమర్శించారు. జగన్ అధి కారంలోకి రాకుండా ఉన్న ట్లయితే 2020-21 కే పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. 2014-19 బడ్జెట్‌లో సాగునీటికి 9.7 శాతం ఇస్తే జగన్ 2.7 శాతం మాత్రమే ఖర్చు చేశారని, రాయలసీమ కోసం టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చుపెడితే నాడు జగన్ ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లు ఖర్చు చేసిందని, అది రాయలసీమకు ద్రోహం కాదా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో జగన్ ప్రభుత్వంలో 450 ఎత్తి పోతల పథకాలు మూలనపడ్డాయని విమర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్లు పోయినా, మోటార్లు రిపేర్లు వచ్చినా, గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శించారు.

సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిల్లా ఎడ్ల జతకు ప్రథమ స్థానం

● హోరాహోరీగా ఎడ్లబండ లాగుడు పోటీలు



ప్రథమస్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా ఎడ్ల జత

దుర్గి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి):తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఎడ్ల బండలాగుడు పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంలో నంద్యాల జిలా పాణ్యం మండలంలోని ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మేశ్వరరెడ్డి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. మండలంలోని ధర్మవరంలో శ్రీహరిహర బాలనాగేంద్ర స్వామి వార్షికోత్సవం సందర్భంగా గ్రామంలో ఈ పోటీలు నిర్వహించారు. ప్రథమ స్థానంలో నిలిచిన ఎడ్ల జత నిర్ణీత వ్యవధిలో 4142.9 అడుగుల దూరం లాగింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సాకేత్‌రెడ్డి, సారికరెడ్డి ఎడ్ల జత 3660 అడుగులు లాగి రెండోస్థానంలో, ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని గంగన్నపాలెంకు చెందిన ఉమ్మారెడ్డి శ్రీవల్లి ఎడ్ల జత 3502.10 అడుగులు లాగి మూడోస్థానంలో, పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్‌చౌదరి ఎడ్లజత 3500 అడుగులు లాగి నాలుగో స్థానంలో, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలంలోని మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత 3446.5 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డిలు వ్యవహరించారు. సేద్యం విభాగంలో బుధవారం పోటీలు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలుత జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లుతో కలిసి మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఈ పోటీ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడ్ల పోటీలు పశుపోషకులకు పండుగ లాంటిదని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి ఎంతో ఉత్సాహంగా రైతులు తరలివచ్చి ఆసక్తిగా పోటీలను తిలకించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రశాంత వాతావరణంలో పోటీలు జరుపుకోవడం శుభసూచికమన్నారు. 2019 సంవత్సరంలో ఇదే వార్షికోత్సవాల్లో జనసేన నేతలు జనసేన పార్టీ జెండా ఊపారనే అక్కసుతో వారిపై వైసీపీ నేతలు దాడి చేయడంతోపాటు కేసులు నమోదు చేసి అప్పటి నుంచి వేరే రాజకీయ పార్టీ నేతలను వేడుకల్లో పాల్గొనకుండా చేశారని చేశారన్నారు. ప్రస్తుతం ఎటువంటి కక్ష సాధింపులు లేకుండా అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు సమాజ శ్రేయస్సు కోసం శ్రమిస్తున్నారన్నారు. జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గాదె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ నేతలు ఎన్నో ఒత్తిళ్లకు ఎదురొడ్డి నిలబడిన ధర్మవరం జనసైనికులు అందరికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం బ్రహ్మానందరెడ్డి, వెంకటేశ్వర్లును కూటమి నేతలు గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుర్రి శివారెడ్డి, పులి హరి, పంగులూరి అంజయ్య, యేచూరి సునీతాశంకర్, బూసా రామాంజినేయులు, కటకం అంకారావు, చిరుమామిళ్ల కృష్ణయ్య, దిగుమర్తి సుబ్బారావ, ఆకుల లక్ష్మణ, రుద్రాల రవి, కటకం రామారావు, గుండాల వెంకటేశ్వర్లు, తక్కెళ్లపాటి వెంకటేశ్వర్లు, ధారా రాఘవరావు, యాగంటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జేకేసీ కళాశాలలో నూతన ఆడిటోరియంను నేడు ప్రారంభించినున్న డీజీపీ



జేకేసీకళాశాలలో నిర్మించిన నూతన ఆడిటోరియం

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డిజిపి సిహెచ్ ద్వారక తిరుమలరావు బుధవారం నగరానికి రానున్నారు. బుధవారంసాయంత్రం 5 గంటలకు జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జాగర్లమూడి లక్ష్మయ్యచౌదరి పేరుతో నిర్మించిన నూతన ఆడిటోరియాన్ని డీజీపీ ద్వారక తిరులమరావు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి వినుకొండ ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, జాగర్లమూడి మురళీమోహన్, పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు యర్లగడ్డ ఉమాదేవి, కాకినాడ సీపోర్టు ఛైర్మన్ కెవిరావు, జేకేసీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ మాదల శ్రీనివాసు, చుక్కపల్లి రమేష్ తదితరులు పాల్గొంటారు.

ఉదయం పాస్.. సాయంత్రం ఫెయిల్

(5వ పేజీ తరువాయి)

చూపిస్తుంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు వినియోగిస్తున్న యంత్రాలకు, సీసీఐ బయ్యర్లు వినియోగిస్తున్న యంత్రాలకు తేడా కనిపిస్తుంది. సీసీఐ కేంద్రాల్లో ప్లాస్టిక్ గోతాల్లో పత్తి తీసుకువస్తే కొనుగోలు చేయడంలేదు. దీంతో రైతులు విడిగానే పత్తిని లోడ్ చేసి తీసుకువస్తున్నారు. మినీ ఆటోల్లో పత్తిని ఎక్కువ మొత్తంలో తొక్కడం వల్ల లోపల వేడి పెరిగి తేమ శాతం పెరిగిపోతుందని రైతులు చెబుతున్నారు. ఒకే లాట్‌లో ఐదు రకాలుగా తేమ శాతం నమోదవుతుంది.

రవాణా భారం తడిసి మోపెడు..

మద్దతు ధర వస్తుందన్న ఆశతో సీసీఐ కేంద్రాలకు రైతులు పత్తిని తరలిస్తున్నారు. అందుకు రవాణా భారం తడిసి మోపెడవుతోంది. అయితే అంత భారం భరించి తీసుకువచ్చిన తర్వాత తేమ శాతం ఎక్కువగా ఉందన్న కారణంతో కొన్ని లాట్లు కొను గోలుకు బయ్యర్లు సుముఖత చూపటం లేదు. దీంతో దానిని వెనక్కి తీసుకెళ్లడంతో రైతులపై అదనపు భారం పడుతుంది. ఉదాహరణకు గుంటూరు మండలం చౌడవరం నుంచి జూటూరి వెంకయ్య అనే రైతు ఐదో మైలు వద్ద ఉన్న జగ్గయ్యపేట కేంద్రానికి 15 క్వింటాళ్ల పత్తిని తీసుకువచ్చేందుకు రూ.2500 వ్యయమైంది. పత్తి లోడ్‌కు క్వింటాల్‌కు రూ.150 కింద ఖర్చు అయ్యింది. తెచ్చిన మొదటి రోజు కొనుగోలు చేయకపోవ డంతో ఆటో వెయిటింగ్ చార్జి కింద రూ.1000 వరకు చెల్లిం చారు. అంత వ్యయం చెల్లించి ఒకరోజు అంతా నిరీక్షించినా తేమ శాతం అధికంగా ఉందని కొనుగోలు చేయలేదు. ఆ పత్తిని తిరిగి తీసుకువెళ్లడం రైతుకు తలకు మించిన భారమైంది. సీసీఐకి తీసుకువచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లాలంటే ఇబ్బందిగా ఉంటుందంటున్న రైతులు ఎంతో కొంత తగ్గించి అయినా కొనుగోలు చేయాలని అధికారులను కోరుతున్నారు.

తేమ శాతం పెంచి కొనుగోలు చేయాలి

మలిపెద్ది లక్ష్మీ నారాయణ, కొర్రపాడు, మేడికొండూరు మండలం



ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురిశాయి.ఇప్పుడు చలి కాలం వచ్చేసింది. గాలిలో తేమ శాతం పెరిగిపోయింది. ఇటు వంటి పరిస్థితిలో పత్తి ఆరాటం చాలా కష్టం. సీసీఐ అధికారులు తేమ శాతం పెంచి పత్తిని కొను గోలు చేయాలి. లేకపోతే పత్తి రైతులు ఆత్మహత్యలు చేసు కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

ధర తగ్గించి అయినా కొనుగోలు చేయాలి

జుటూరి వెంకయ్య, చౌడవరం, గుంటూరు మండలం



సీసీఐ కేం ద్రానికి తెచ్చిన పత్తిని తిరిగి తీసుకు వెళ్లడం తలకు మించిన భారం. ఒక వేళ తేమ శాతం ఎక్కువగా ఉంటే ధరలో ఎంతో కొంత కోత విధించి పత్తి కొనుగోలు చేయాలి. ఈ విషయంలో అధి కారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న అంగన్ వాడీలు

అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు ఆపండి

వర్కర్స్ అండ్ హెల్పర్స్ ధర్నా

బెల్లంకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలపై దాడులు ఆపాలని సీఐటీయూ పల్నాడు జిల్లా కార్యదర్శి జీ మల్లేశ్వరి అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌తో మంగళ వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బెల్లంకొండ మండలం మన్నె సుల్తాన్ పాలెంకి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బుజ్జి తన భర్తపై అధికార పార్టీ నాయకులు అంగన్ వాడీ ఉద్యోగానికి రాజీనామా చేయాలని అసభ్యకరంగా తిట్టి ఆమెపై దాడి చేసినట్టు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న యూనియన్ నాయకులు బెల్లంకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసినట్లు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్ వాడీలు తమ సమస్యల పై 42 రోజుల పాటు సమ్మె చేస్తే సమ్మె శిబిరాల వద్దకు వచ్చిన తెలుగుదేశం నాయ కులు అంగన్‌వాడీలకు రక్షణగా ఉంటామన్నారని, ప్రతిపక్షంలో ఉండగా రక్షణ కల్పిస్తామని మాట్లాడిన పార్టీ కార్యకర్తలు ఇప్పుడు అంగన్‌వాడీలపై దాడులు చేయడం దుర్మార్గమని విమర్శిం చారు. అంగన్‌వాడీలు తమ విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్పా భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని అన్నారు. నాయకులు దాడులు ఆపక పోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు జీ రవి బాబు మాట్లాడుతూ నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో అంగన్ వాడీ కార్యకర్తలపై, మధ్యాహ్న భోజన కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్నారని అన్నారు. ఇటువంటి విధానాన్ని నిరోధించటానికి ఎమ్మెల్యే ప్రవీణ్ చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ పుల్లారావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వినూత్న పద్ధతుల్లో విద్యార్థులకు బోధన అందించాలి

గుంటూరు(విద్య), నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి వినూత్న పద్ధతుల్లో బోధన అందించాలని ఉర్దూ డీఐ ఎస్‌కెఎండి ఖాసిం అన్నారు. స్థానిక చౌత్రాసెంటర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని ఉర్దూ కాంప్లెక్స్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థులకు మెరుగైన పద్ధతుల్లో బోధించాలని సూచించారు. తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అనుసరించే బోధన విధానాలు పిల్లలు ఆకట్టుకునే విధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల సముదాయ ఛైర్మన్ వసుంధర, వివిధ మండలాల ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల బీమాతో ధీమాగా ఉండొచ్చు

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు



గుంటూరు సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతుల పంటలు చేతికి వచ్చే వరకు 'నో గ్యారెంటీ..నో వారంటీ' అన్న రీతిలో ఉంటున్నాయి. వాతా వరణంలో సంభ విస్తున్న మార్పులు వల్ల పెట్టుబడులు పెట్టిన అన్నదాత ఎక్కువ సార్లు నష్టపోతున్నారు. ఈ పరిస్థితి నుంచి రైతులను తప్పించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, పునఃసంస్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం ప్రవేశపెట్టాయి. వాటి వివరాలు పూర్తిగా తెలుసుకునేందుకు జిల్లా వ్యవసాయ శాఖాధికారి నున్న వెంకటేశ్వర్లుతో 'ఆంధ్ర జ్యోతి' ఫటా ఫట్..



పంట బీమా ప్రయోజనం ఏమిటి?

అధికారి: అతితక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి చేకూర్చే ప్రక్రియ ఇది. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు వెన్నుదన్నుగా ఉండే అవకాశం ఉంటుంది. కేవలం రైతు ప్రయోజనం అంతా పంటల బీమాపై ఆధారపడి ఉంటుంది.

ఏ ఏ పంటలకు భీమా వర్తిస్తుంది..

అధికారి: ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన,పునఃసంస్థాపిత వాతావరణ ఆధారిత పంట బీమా పథకం కింద లబ్ధి పొందేందుకు కొన్ని పంటలను గుర్తించాం. మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర,పప్పు శెనగ పంటలకు ఈ బీమా వర్తిస్తుంది.

ఏ పంటకు ఎంత బీమా ప్రీమియం చెల్లించాలి?

అధికారి: ఎకరా మొక్కజొన్నకు రూ.114, జొన్నకు రూ.48, మినుముకు రూ.50, పెసరకు రూ.45, పప్పుశెనగకు రూ.70 చొప్పున చెల్లించాలి.

బీమా చెల్లించేందుకు ఎప్పటి వరకు గడువు ఉంది?

అధికారి: పంటల బీమాలో చేరేందుకు డిసెంబర్ 15 వరకు గడువు ఉంది. రైతులు అశ్రద్ధ చేయకుండా ఈ పథకంలో, ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి.

నమోదు ప్రక్రియలో ముఖ్యమైన విషయాలు ఏమిటి..

అధికారి: బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులకు ఆటోమ్యాటిక్‌గా బీమా సొమ్ము కట్ అవుతుంది. రుణాలు పొందని రైతులు స్వయంగా సమీప కామన్ సర్వీస్ సెంటర్‌కు వెళ్లి స్పాట్ నమోదు చేయించుకోవాలి. అందుకోసం ఆధార్ కార్డు,లీజు ఒప్పందం (కౌలు రైతులకు) పంట సాగు విస్తీర్ణ సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్ వివరాలు తీసుకొని వెళ్ళాలి. పంట సాగు సర్టిఫికెట్ ను గ్రామ అగ్రికల్చరల్ అసిస్టెంట్, గ్రామ హార్టికల్చరల్ అసిస్టెంట్, రైతు సేవ కేంద్రం ఇన్‌చార్జి ద్వారా జారీ చేస్తారు. రైతులు కామన్ సర్వీస్ సెంటర్ లో ఇచ్చిన రశీదు ప్రకారం సరిగ్గా ప్రీమియం చెల్లించాలి.



డీఆర్ఎం కప్ టోర్నమెంట్ ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, ఇతర అధికారులు

22 నుంచి డీఆర్ఎం కప్ టోర్నమెంట్

● రెండో ఎడిషన్ ప్రారంభిస్తాం

● గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్ రెండో ఎడిషన్ ఈ నెల 22 నుంచి ప్రారంభంకానున్నట్లు గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ తెలిపారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మిం టన్, బాస్కెట్ బాల్ క్రీడల్లో పోటీలు జరుగుతాయని చెప్పారు. స్థానిక పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో టోర్నమెంట్ వివరాలను డీఆర్ఎం మంగళవారం మీడియాకు వివరించారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల మధ్యన స్నేహపూర్వక వాతావరణం, సమన్వయం తీసుకొచ్చే లక్ష్యంతో తాము గత ఏడాది ప్రథమంగా డీఆర్ఎం కప్ ఫస్టు ఎడిషన్ ప్రారంభించామన్నారు. దీనికి మంచి స్పందన వచ్చిందని చెప్పారు. ఆ స్ఫూర్తితో ఈ ఏడాది సెకండ్ ఎడిషన్‌ని ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది సెకండ్ ఎడిషన్‌ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలు ఈ నెల 22, 23, 24, 29, 30, డిసెంబరు 1న నల్లపాడులోని రైల్‌విహార్ గ్రౌండ్స్‌లో జరుగుతాయని, విజేతలకు రూ. 75 వేలు, రన్నర్స్‌కు రూ. 50 వేల నగదును అందజేస్తామని వివరించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ పోటీలు ఈ నెల 22, 23, 24 తేదీల్లో డీఆర్ఎం ఆఫీసు కాం పౌండ్‌లోని ఆటస్థలాల్లో జరుగుతాయని, వీటిల్లో విజేతలకు రూ. 15 వేలు, రన్నర్స్‌కి రూ.7 వేలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 3 వేలు అందజేస్తామని వివరించారు. ఈ నెల 20 సాయంత్రం వరకు ఎంట్రీలు పంపవచ్చని తెలిపారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని గుంటూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, ప్రకాశం, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లా లకు చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈ టోర్నమెంట్ పాల్గొనవచ్చని సూచించారు. వివరాలకు సీహెచ్ విజయకుమార్ (9701379911), వై శ్రీనివాసరావు (9347785888) ఆయా నంబర్లలో సంప్రదించాలని సూచిం చారు. సమావేశంలో ఏడీఆర్ఎం కేసైమన్, సీనియర్ డీపీఎం ఎం దినేష్ కుమార్, సీనియర్ అధికారులు షాబాజ్ హనూర్, ప్రదీప్‌కుమార్, విజయకీర్తి తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య),నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం మంగళగిరిలోని వీవర్స్‌కాలనీలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా యార్లగడ్డ శ్రీనివాసరావు, కార్యదర్శిగా చుక్కా కొండయ్య, కోశాధికారిగా గంగాధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా అశోక్‌బాబు ఎన్నికయ్యారు. నూతన కమిటీ నాయకులు సోమవారం డీఈవో సీవీ రేణు కను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పాఠశాలల్లో క్రమశిక్షణతోపాటు, క్రీడాభివృద్ధికి నూతన కమిటీ కృషి చేయాలని డీఈవో సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124,135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

39,948 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 43,356 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 39,948 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 31,944 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	9800	14000
నెంబరు. 5	9000	11500	నెంబరు. 5	-	-
273	10000	12000	273	-	-
341	8000	15500	341	9000	14500
4884	-	-	4884	14000	14000
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	17000	తేజ	9500	16000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	9000	12800
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9500	14500
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	5000	10000

శ్రీఅమరలింగేశ్వరస్వామి ఆలయ ఆదాయం రూ.3,12,508

గురజాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దైద బిలంలో ఉన్న శ్రీఅమరలింగేశ్వరస్వామి ఆలయానికి రూ.3,12,508 ఆదాయం సమకూరినట్లు ఈవో పూర్ణచంద్రరావు తెలిపారు. ఈనెల 13 నుంచి 18వ తేదీ వరకు భక్తులు నగదు రూపేణా సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. సత్తెనపల్లి డివిజన్ ఇన్‌స్పెక్టర్ లీలావతి పర్యవేక్షించారు.

సభ్యత్వ నమోదులో ముందుండాలి

● మాజీ మేయర్ కన్నా నాగరాజు

ముప్పాళ్ళ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదులో నియోజకవర్గాన్ని ముందు నిలిపేందుకు ప్రతీ టీడీపీ కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని లంకెలకూరపాడులోని మంగళవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి నాయకులతో మాట్లాడారు. ప్రతి గ్రామంలోను కార్యకర్తలు, నాయకులు తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేయించుకోవాలన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన

ముప్పాళ్ళ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముప్పాళ్ళ హైస్కూల్లో ఉన్న పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ ఎం భవానీ శంకర్ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఉన్న సదుపాయాలను పరిశీలించి అవసరమైన వాటిని ఏర్పాటు చేయాలని సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట డీటీ లక్ష్మీప్రసాదు, వీఆర్‌వో తదితరులు ఉన్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండాలి

సత్తెనపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదకర వ్యాధులకు కారణమయ్యే దోమలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జీ వీర్రాజు సూచించారు. ఎంటమాజికల్ సర్వేలో భాగంగా మంగళవారం పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో స్థానిక మలేరియా సిబ్బందితో కలసి ఆయన పర్యటించారు. వెంగళరెడ్డినగర్‌లో పలు ప్రాంతాల్లో డ్రమ్ముల్లో, తొట్లల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి ఆ ప్రాంత ప్రజలకు తగు సూచనలు ఇచ్చారు.

రోల్‌బాల్ జట్టుకు విద్యార్థుల ఎంపిక

క్రోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రోసూరు సెయింట్ ఆన్స్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు పల్నాడు జిల్లా రోల్‌బాల్ జట్టుకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ మేరీ రజిత తెలియజేశారు. ఎంపిక కార్యక్రమం గుంటూరు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో జరిగిందన్నారు. అండర్ - 14 విభాగంలో షేక్ అబూ బకర్, కే అక్షయ ప్రణీత్, అండర్ - 17 విభాగంలో ఎస్ జాకీ చాన్, యూ ప్రసన్, ఎస్ జాహ్నవి ఎంపికైనట్టు తెలిపారు. వీరు వచ్చే నెలలో తిరుపతిలో జరిగే అంతర్ జిల్లాల రోల్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

మహిళా సమాఖ్య

జిల్లా అధ్యక్షురాలిగా రజిని



కోయ రజిని

మాచవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా మాచవరం మండల మహిళా అధ్యక్షురాలు కోయ రజిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా మహిళా సమాఖ్య సమావేశంలో కోయ రజినీని 28 మండలాల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 584.60 అడుగులు ఉంది. ఇది 296.28 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4254 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5367 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 12,321 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 12,231 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో మంగళవారం 39.64 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు.

కస్తలలో టీడీపీ కార్యకర్త మృతి

అచ్చంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తల గ్రామంలో టీడీపీ కార్యకర్త అన్నమ్మ(54) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. పార్టీ నాయకులు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపి అనంతరం రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందించారు.

ఎస్‌ఐ ఉద్యోగం ఇస్తానని మోసగించిన వ్యక్తి అరెస్టు

రెంటచింతల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఐ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓ యువతి దగ్గర రూ.25 లక్షలు తీసుకుని మోసం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ సీహెచ్ నాగార్జున మంగళవారం చెప్పారు. కడప జిల్లా ఖాజీపేటకు చెందిన చిలతోటి లోకేశ్ రెంటచింతల ఎర్రపాలెంకు చెందిన మస్తాన్‌బీ వద్ద 2023 జూన్ నుంచి విడతల వారీగా రూ.25 లక్షలు వసూలు చేశాడు. అయితే ఎప్పుడగినా రేపో మాపో జాయినింగ్ ఆర్డర్ వస్తుందంటూ మోసం చేశాడు. నిందితుడిని అరెస్టు చేసి మాచర్ల కోర్టులో హాజరుపర్చగా పీజేసీజే శ్రీనివాసకళ్యాణ్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం విక్రేతపై కేసు

పిడుగురాళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని శ్రీనివాసపురంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ కర్ల మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పిడుగురాళ్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శ్రీనివాసపురం గ్రామానికి చెందిన దప్పిలి ఆంజనేయులురెడ్డి వద్ద తెలంగాణకు చెందిన 59 మద్యం బాటిల్స్ ఉండటాన్ని గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

చిన్నారుల భవితకు బాసట

● భవిత కేంద్రాల సేవపై ప్రభుత్వం దృష్టి

● ఫిజియోథెరపి సేవల పునరుద్ధరణ



విద్యార్థులకు పరికరాలతో బోధిస్తున్న ఉపాధ్యాయులు



పట్టణంలోని భవిత కేంద్రం

సత్తెనపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాల పిల్లలకు భవిత కేంద్రాలు బాసటగా నిలుస్తున్నాయి. విద్యాశాఖ సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రాలపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా బోధకులకు, పిల్లలకు బకాయిలు సకాలంలో చెల్లించకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఫిజియోథెరపీ సేవలను పునరుద్ధరించటంతో పాటు వివిధ అంశాలపై దృష్టి సారిస్తుంది. చిన్నారుల భవితకు బాటలు వేస్తుంది. సత్తెనపల్లి భవిత కేంద్రంలో 20మంది పిల్లలున్నారు. వీరికి విద్యను అందించేందుకు మేథోవైకల్యం, స్పీచ్ థెరపీ ఉపాధ్యాయులు ఉన్నారు. చెవిటి, మూగ పిల్లలకు సేవలు అందిస్తున్నారు. సాధారణ కదలికలు, కండరాల్లో వైకల్యం, మెదడు అభివృద్ధి లోపం, నరాల బలహీనత బారిన పడిన పిల్లలకు ఈ కేంద్రంలో వారంలో ఒక రోజు ఫిజియోథెరపీ సేవలను అందిస్తున్నారు. భవిత కేంద్రంలో విద్యను అభ్యసించే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు రాను పోను రవాణా, అంగరక్షక భత్యాలు వేర్వేరుగా నెలకు రూ.300 చొప్పున ఇవ్వాలి. బాలికలకు ప్రత్యేక భత్యాలు, రీడర్ అలవెన్స్, స్పీచ్ థెరపీ, కళ్ళ జోళ్ళు, ఎంఆర్ కిట్లు సమకూర్చాల్సి ఉంది. అంతే గాకుండా బిహేవియర్ మాడిఫికేషన్, విచిత్ర ప్రవర్తన అదుపునకు కృషి, ఐక్యూ స్క్రీనింగ్, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తూ విద్యాబోధన సాగిస్తున్నారు. మానసిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వారిలో చదవటం, రాయటం, సంఖ్యల గుర్తింపు, లెక్కింపు, నిత్య జీవితంలో అవసరమైన పనులు స్వతహాగా చేసుకోవటం వంటి విషయాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. రవాణా భత్యాలు అరకొరగా అందుతుండటంతో పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లేందుకు ఆటోలకు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోతున్నారు. రవాణా భత్యాలతో పాటు పిల్లలకు అందాల్సిన వివిధ భత్యాలు సకాలంలో సక్రమంగా అందించేందుకు సమగ్ర శిక్ష అధికారులు కృషి చేస్తున్నారు.

పల్లె పండుగ పనులు 15లోపు పూర్తి కావాలి

● నీటి యాజమాన్య సంస్థ పీడీ సిద్ధలింగమూర్తి



సమీక్షలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి

రాజుపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో శంకుస్థాపన చేసిన పనులు డిసెంబరు 15వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధలింగమూర్తి ఆదేశించారు. మంగళవారం మండలంలోని రాజుపాలెంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకంపై నియోజకవర్గ స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సిద్ధలింగమూర్తి మాట్లాడుతూ భూగర్భ జలాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రతి ఇంట్లో వారి మోటర్ పక్కనే ఇంకుడు గుంత, పొలాల్లో సేద్యపు కుంట తీసి భూగర్భ జలాలు పెరిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం ఉన్నతి పథకం కింద 100రోజులు పనిదినాలు పూర్తి చేసిన వారిని గుర్తించి వారిలో పది, ఇంటర్ పూర్తి చేసిన వారికి ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. పాడి, పంట పథకం కింద గోకులాల నిర్మాణాలు పూర్తి చేయటంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కింద రెండు సంవత్సరాలు పశుగ్రాసం పెంచుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. జాబ్‌కార్డులో 2007 తరువాత చనిపోయిన వారిని తొలగించటం, 18సంవత్సరాలు నిండిన వారిని చేర్చుకోవటం వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో జీవి సత్యనారాయణ, ఏపీడీ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

కన్నుల పండువగా లక్ష రుద్రాభిషేకం



శివలింగానికి అభిషేకం చేస్తున్న యరపతినేని నిఖిల్

దాచేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రంతో కూడిన మంగళవారం కలిసిరావడంతో లక్ష రుద్రాక్షలతో మహాశివునికి అభిషేకం నిర్వహించారు. మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీ బొడ్రాయి సెంటర్లో మాజీ ఎంపీపీ అంబటి నవకుమార్ పర్యవేక్షణలో లక్ష రుద్రాక్షలతో మహాశివలింగానికి అభిషేకం నిర్వహించారు. పంచామృతాల అభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యరపతినేని నిఖిల్ హాజరయ్యారు.

పిడుగురాళ్లలో అయ్యప్ప పడిపూజ

పిడుగురాళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగమ్మతల్లి దేవాలయం వద్ద జరిగిన అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో యరపతినేని నిఖిల్ పాల్గొన్నారు. వేలాది మంది అయ్యప్పలు, భవానీలు, శివమాలదారులు, భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఐడీ ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీలకు అవగాహన

రాజుపాలెం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడు గ్రామ శివారు లక్ష్మీపురం తండాలో మంగళవా రం ఎస్సీ, ఎస్టీలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఏపీ సీఐడీ అడిషనల్ డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు గుంటూరు సీఐడీ రీజనల్ అధికారి ఆదినారాయణ ఉత్తర్వుల మేరకు నిర్వహించిన ఈ సదస్సులో సీఐలు శివరామకృష్ణ, పూర్ణచంద్రరావు, ఎస్‌ఐలు పాతిమా, వెంకటేశ్వర్లు, ఆర్‌డీ ప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల హక్కులు, వారిపై అత్యాచారాలు జరిగినపుడు వారు చట్టాలను ఎలా ఉపయోగించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీల రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, చంద్రనాయక్, తహసీల్దార్ దుర్గేశ్వరరావు, పీపీ బగ్గి నాగేశ్వరరావు, ఎస్‌ఐ వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి అభినందనీయం

● ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి

క్రోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి అభినందనీయమని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ రమాదేవి అన్నారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహించారు. నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరు కాగా 66 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో 31 మందిని వివిధ ఉద్యోగాల కోసం ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేశారు.

సీసీఐలో పత్తి క్వింటాల్‌కు రూ7,521

పెదకూరపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారి ద్వారా పత్తి క్వింటాల్‌కు కనీస మద్దతు ధర రూ.7,521 చొప్పున కొనుగోలు చేస్తామని వ్యవసాయశాఖ జిల్లా అధికారి మురళీ తెలిపారు. పెదకూరపాడులో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పత్తి రైతులు ముందుగా రైతుసేవా కేంద్రాల్లో లేదా వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, పత్తిలో తేమ శాతం ఎనిమిది నుంచి 12 వరకు ఉండేలా చూసుకోవాలని అన్నారు.

ప్లాస్టిక్ గోతాలలో పత్తిని తీసుకురావద్దు

దాచేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు తమ పత్తిని లూజుగా గాని, గన్నీ బ్యాగ్‌లలో గాని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని, ప్లాస్టిక్ సంచుల్లో తీసుకురావద్దని మార్కెట్ యార్డు అధికారులు తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల్లో పత్తిని తీసుకొస్తే సీసీఐలో కొనుగోలు చేయరని తెలిపారు.

పీహెచ్‌సీకి మత్తు డాక్టర్‌గా ప్రియాంక గైనకాలజిస్టుగా డాక్టర్ సుమిత్ర

పెదకూరపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సామాజిక ఆరోగ్య కేంద్రానికి సత్తెనపల్లి పీహెచ్‌సీలో బాధ్యతలు నిర్వహిస్తున్న గైనకాలజిస్టు డాక్టర్ సుమిత్ర డిప్యూటేషన్‌పై ప్రతి మంగళవారం పెదకూరపాడు పీహెచ్‌సీలో వైద్యసేవలు అందిస్తారని సూపరింటెండెంట్ డాక్టర్ విద్య మంగళవారం తెలిపారు. మత్తు డాక్టర్‌గా ఎస్ ప్రియాంక ఉద్యోగ బాధ్యతలు చేపట్టినట్టు వివరించారు.

ప్రభుత్వాస్పత్రి రికార్డుల తనిఖీ

అచ్చంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆస్పత్రిలో రోజు వారీగా జరిగే ఆరోగ్య కార్యక్రమాలను ప్రణాళికా బద్ధంగా జరిగేటట్టు చూడాలని జిల్లా డిప్యూటీ వైద్యశాఖ అధికారి డాక్టర్ ఎం పద్మావతి మంగళవారం అన్నారు. ఆమె అచ్చంపేటలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో జరిగే గర్భవతుల అబ (ఆయు ష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) మ్యాపింగ్‌లు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులను పరిశీలించారు.


ఆధార్ జిరాక్స్‌లు తీసుకెళ్లాలి

సత్తెనపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పింఛను తీసుకునే లబ్ధిదారులు బ్యాంక్ ఖాతా లేని పక్షంలో పోస్టాఫీసు ద్వారా బ్యాంక్ ఖాతాలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ షమ్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పింఛన్‌కు కావాల్సిన అర్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీ, రూ.200 తీసుకొని రైల్వేస్టేషన్ రోడ్డులో గల రెండో సచివాలయానికి ఈనెల 20వ తేదీ వెళ్లాలని సూచించారు.

మినీ గోకుల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి : ఎంపీడీవో

మాచవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో జరుగుతున్న మినీ గోకుల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం మండలంలోని సింగరాయపాలెం తండాలో నిర్మాణం జరుగుతున్న మినీ గోకులాన్ని ఆయన పరిశీలించారు.

పలు కేసుల్లో నిందితుల అరెస్టు.. వివరాలను వెల్లడించిన డీఎస్పీ



షరీఫ్ హత్య కేసు నిందితుల వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ జగదీష్, వెనకాల నిల్చున్న నిందితులు

గురజాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గురజాల సబ్ డివిజన్ పరిధిలోని మూడు కేసుల్లో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో కేసుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈనెల 13వ తేదీన గోగులపాడు సమీపంలోని మేజర్ వద్ద పట్ట కప్పి ఉన్న మృతదేహం లభ్యం కాగా పోలీసులు కేసు న మోదు చేశారు. మృతుడు తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ మండలం, కుట్లూరు గ్రామం, జయభారత్‌నగర్ కాలనీకి చెందిన మహ్మద్ షరీఫ్‌గా గుర్తించారు. షరీఫ్ మండలంలోని పాత అంబాపురంనకు చెందిన ఆనం అంకిరెడ్డి, సైదమ్మ దంపతుల వద్ద పదేళ్లుగా మిర్చి కోతలకు వస్తున్నాడు. ఇందుకు సంబంధించి ఆ దంపతులు రూ.లక్ష వరకు షరీఫ్‌కు ఇవ్వాల్సి ఉంది. ఈనెల 11వ తేదీన రాత్రి 8 గంటల సమయంలో షరీఫ్ డబ్బులు అడగ్గా సదరు దంపతులు రేపు ఇస్తాం అని చెప్పడంతో షరీఫ్ వారింట్లోనే ఉన్నాడు. మరుసటి రోజు (12వ తేదీ) రాత్రి 9 గంటల సమయంలో పదే పదే షరీఫ్ డబ్బులు అడుగుతుండడంతో అతడిని హత్య చేసేందుకు పథకం పన్నారు. అంకిరెడ్డి, సైదమ్మలు కసుకర్తి సంసోన్ అనే వ్యక్తితో కలిసి హత్య చేశారు. తరువాత ద్విచక్ర వాహనంపై మృతదేహాన్ని గోగులపాడు శివారులోని మేజరు కాలువలో పడవేశారు. నిందితులను పాత అంబాపురంలోని పాత రైస్ మిల్లు వద్ద మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. అలాగే మాచర్ల పట్టణంలోని వినాయకుని గుట్టకు చెందిన పోలేపల్లి ఆనంద్, ఆలేటి లక్ష్మయ్యలకు సంబంధించిన ద్విచక్ర వాహనాలు ఈనెల 16వ తేదీన అర్ధరాత్రి దగ్ధం చేసిన కేసులో అదే ప్రాంతానికి చెందిన ఆదిరాల కిషోర్‌బాబు, ఊరే మరియబాబుతోపాటు మరో మైనర్ బాలుడిని అదుపులో కి తీసుకున్నామన్నారు. వెల్దుర్తి మండలంలో 11 ట్రాన్స్‌ఫార్మర్ల లో రాగి వైరు చోరీకి పాల్పడిన మాచర్లలోని రేగులగడ్డ కాలనీకి చెందిన మేదర నాగరాజు, తమ్మిశెట్టి కిషోర్, శరీన్ కాలనీకి చెందిన జెల్లి రాజులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

విద్యుత్ బకాయిల వసూళ్లు వేగవంతం చేయాలి : ఎస్ఈ

పిడుగురాళ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్‌శాఖ తీవ్రంగా కృషి చేస్తుందని పల్నాడు జిల్లా ఎస్ఈ పి.విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం కొండమోడులోని విద్యుత్ కార్యాలయంలో నరసరావుపేట, మాచర్ల సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో ఎస్ఈ విజయకుమార్ సమీక్ష నిర్వహించారు. 24గంటలు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని, అదేవిధంగా వినియోగదారుల నుంచి క్రమం తప్పకుండా బిల్లుల వసూళ్లను వేగవంతం చేయాలని ఎస్ఈ విజయకుమార్ ఆదేశించారు. అనంతరం సబ్‌డివిజన్ వారీగా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఓఎస్‌డీ ఏవీ సాంబశివరావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో లోపాలను పూర్తిగా తొలగించి గ్రామీణ ప్రాంతాల్లో సైతం 24 గంటలపాటు విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ సమావేశంలో ఈఈ ఆపరేషన్ రాంబొట్లు, టెక్నికల్ డీఈ రామ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నకరికల్లు విద్యుత్ ఏఈ సస్పెన్షన్

నకరికల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నకరికల్లు విద్యుత్‌శాఖ ఏఈగా పని చేస్తున్న పీ నాగసురేష్‌బాబును సస్పెండ్ చేస్తూ పల్నాడు జిల్లా ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ పీ విజయ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాసమస్యల పరిష్కార విధానంలో నిర్లక్ష్యంగా వ్యవహరించి నందుకు గాను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఎస్ఈ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.

ఉండవల్లి శ్రీదేవిని కలిసిన పేరయ్య



ఉండవల్లి శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పేరయ్య

కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ నియమితులైన ఉండవల్లి శ్రీదేవిని మంగళవారం కారంపూడి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య కలిశారు. తాడేపల్లిలో శ్రీదేవిని కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సాతులూరి కుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కుమార్‌కు సన్మానం

మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాతులూరి కుమార్‌ను మంగళవారం కారంపూడి పట్టణంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు పేరయ్య ఆధ్వర్యంలో కుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ నేతలు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కలిగి ఉండాలి

● స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు

కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కలిగి ఉండాలని స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు అన్నారు. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని ఒప్పిచర్ల ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్డి ఆవశ్యకతను సుబ్బారావు వివరించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి అవసరమని, మరుగుదొడ్డి లేని వారికి ప్రభుత్వ స్వచ్ఛభారత్ మిషన్ కింద మరుగుదొడ్డి మంజూరు చేస్తుందని అన్నారు.

యాదవ కార్తీక వన సమారాధనను జయప్రదం చేయండి

దుర్గి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24వ తేదీన మాచర్ల పట్టణంలో నిర్వహించనున్న యాదవ కార్తీక వన సమారాధనను జయప్రదం చేయాలని యాదవ సంఘ నేతలు కోరారు. దుర్గిలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. వన సమారాధనను భారీగా విచ్చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు.

ఏరియా వైద్యశాలలో మందుల కొరత లేదు

● సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు

ఫటాఫట్



సత్తెనపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏరియా వైద్యశాలలో మందుల కొరతలేదని సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. కుక్క కాటు, పాము కాటు ఇంజక్షన్లు ఉన్నాయని చెప్పారు.

ప్ర: వైద్యశాలకు నిత్యం ఓపీ ఎంత ఉంటుంది?

జ: నాలుగు నుంచి ఐదు వందల వరకు ఉంటుంది.

ప్ర: కుక్క, పాము కాటు ఇంజక్షన్లు ఉన్నాయా?

జ: ఏఆర్‌వీ, ఏఎస్‌పీ ఇంజక్షన్‌లు సరిపడా ఉన్నాయి.

ప్ర: అన్ని రకాల మందులు ఉన్నాయా?

జ: అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి కొరత లేదు.

ప్ర: ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారా?

జ: ఆరోగ్యశ్రీ సేవలు నెలకు మూడు నుంచి నాలుగు వందల మంది రోగులకు అందిస్తున్నాం.

ప్ర: అన్ని రకాల రక్త పరీక్షలు ఆస్పత్రిలో చేస్తున్నారా?

జ: 80 రకాల రక్త పరీక్షలు ఆస్పత్రిలో చేస్తున్నాం. ఎక్స్‌రే, ఈసీజీ, గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు కూడా ఉచితంగా చేస్తున్నాం.

ప్ర: వైద్యుల, సిబ్బంది కొరత ఏమైనా ఉందా?

జ: ఒక రేడియాలజిస్టు, డీసీఎస్ జనరల్ డ్యూటీ డాక్టర్, ఎస్‌బీఎస్‌లో ముగ్గురు స్టాఫ్ నర్సుల అవసరం ఉంది.

హరిహర పుత్రుడికి అభిషేకాల మాల

● అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



పడిపూజలో హారతినిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకానిపాలెంలో అయ్యప్పస్వామి మండల పూజను సోమవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 18 రకాల అభిషేకాలు, పడిపూజను గ్రామస్థులంతా కలిసి అయ్యప్ప, శివమాలదారులతో జరిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరై పూజా, అభిషేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామ టీడీపీ నేతలు మాజీ ఎంపీపీ జాస్తి గంగారావు, కోడాడి సీతయ్య, వెంకటేశ్వర్లు, బాలయ్యలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అభిషేకాల అనంతరం పడిపూజను గురుస్వాములు నిర్వహించారు. నరసరావుపేటకు చెందిన కుమారస్వామి భక్తి పాటల కచేరి అలరించింది. అనంతరం బ్రహ్మానందరెడ్డిని గురుస్వాములు, నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు బాలకృష్ణ, కోటేశ్వరరావు, సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పేరుతో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రీ సర్వే పేరుతో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో జీరో అవర్‌లో మంగళవారం నియోజకవర్గ రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే మాట్లాడారు. మంత్రి లోకేశ్ స్ఫూర్తితో నియోజకవర్గంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రెవెన్యూ సమస్యలపై 70 శాతానికి పైగా అర్జీలు వచ్చాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రీసర్వే పేరుతో అక్రమాలకు పాల్పడిందని తెలిపారు. గ్రామంలో నెలకొన్న భూసమస్యల తక్షణ పరిష్కారం కోసం జేసీ లాగిన్‌ను తహసీల్దార్ లాగిన్‌కు మార్చాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గంలో రెండు వేల ఎకరాలకు పైగా భూములు 22ఏలో ఉన్నాయని, వీటి పరిష్కారం కోసం 2019లో ఆర్డినెన్స్‌ను అమలు చేయాలన్నారు. భూ ఆక్రమణలను అరికట్టేందుకు కూటమి ప్రభుత్వం ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను అమలు చేయటం శుభపరిణామమని, రైతులకు ఇబ్బంది కలగకుండా ఈ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు.

బాలల హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న పద్మావతి తదితరులు

సత్తెనపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా చట్టపరంగా చర్యలు తప్పవని ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు విద్య ద్వారా అభివృద్ధి చెందుతారన్నారు. బాల్య వివాహాల వల్ల బంగారు భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత, కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, కంచర్ల బుల్లిబాబు, బాలల పరిరక్షణా విభాగం కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాయిద్యం అంటే ఆమెకు ప్రాణం... డోలుపై ఆమెకు మరింత మక్కువ. మగవారే కాదు... మహిళలూ వాయిద్యాలతో అద్భుతాలు సృష్టించగలరని నిరూపించారామె. డోలు పట్టుకుంటే సున్నితమైన ఆమె చేతివేళ్లు దానిపై లయబద్ధంగా నాట్యం చేస్తాయి... 108 తాళాలు శ్రవణానందకరంగా ఉర్రూతలూగిపోతాయి. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా 1000కి పైగా కచేరీలు చేయటం ఒక ఘనతఅయితే, డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో స్థానం సాధించటం మరో ప్రత్యేకత.


డోలు వాయిస్తున్న మనీషా బాబీ (లలిత మనీషా)

లలిత మనోహరం డోలు వాయిద్యం

- తెనాలికి చెందిన లలిత మనీషాఅద్భుత ప్రదర్శనలు
- డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా ఘనత
- తల్లిదండ్రుల స్ఫూర్తితో గిన్నిస్ రికార్డులూ సొంతం


మంత్రి మనోహర్ దగ్గర కుటుంబ సభ్యులకు సత్కారం

తెనాలి, నవంబరు 19, (ఆంధ్రజ్యోతి): ఆమె పేరు లలిత మనీషా(మనీషా బాబీ). తెనాలికి చెందిన వెంకటేశ్వర సాహెబ్, మస్తాన్‌బీల కుమార్తె లలిత మనీషా. ఆమె తల్లిదండ్రులు కూడా సన్నాయి వాయిద్యంలో దిట్టయితే, వీరి దారిలోనే కుమార్తెకూడా అడుగులు వేశారు. ఎవరైనీ తమ పిల్లలను తాము చేస్తున్న వృత్తి కాకుండా మరింత ఉన్నత చదువులు చదివించాలని, ఉన్నతస్థానంలో నిలపాలని తాపత్రయపడతారు. అయితే మనీషా తల్లిదండ్రులు కూడా ఆమె ఇష్టానికే ప్రాధాన్యం ఇచ్చారు. మనలో దాగిన నైపుణ్యాన్ని వెలికితియ్యటానికి పరుగులుపెట్టాల్సిన పనిలేదని, ఏదిఇష్టమో దానిలో రాణించగలిగితే రికార్డులు సృష్టించవచ్చని మనీషా నిరూపించారు. కళలకు నిలయమైన తెనాలికే గర్వకారణంగా నిలిచారు.

చిన్నప్పటి నుంచే డోలుపట్టి...

మనీషాకు చిన్నప్పటి నుంచి సంగీతం అంటే ఇష్టం. ఆమె తాత నాసర్ మస్తాన్ ప్రముఖ నాదశ్వర విద్వాంశులు. అయితే తన తల్లిదండ్రులు సన్నాయి వాయిద్యంలో ప్రావీణ్యం కలిగినవారు కావటం, నాదస్వరంలో ప్రత్యేకతను చాటటంతో, చిన్నప్పటి నుంచి వాటిని చూస్తూ వాయిద్యాలపై ఆమె మక్కువ పెంచుకున్నారు. పాఠశాల విద్య చదువుతున్న రోజుల్లోనే డోలు పట్టుకున్నారు. లేత చేతులతో డోలుపై తాళాలు వేయగలిగారు. ఆమెకున్న ఆసక్తిని గుర్తించిన తల్లిదండ్రులు డోలు వాయిద్యం విషయంలో ప్రోత్సహించారు. చదువుకుంటూనే అనేక కార్యక్రమాల్లో పాల్గొని, కచేరీలు చేయటం విశేషం. తెనాలిలోనే పాఠశాల విద్య, ఉన్నత విద్య బీసీఏ కూడా తెనాలిలోనే పూర్తిచేశారు. తర్వాత హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో మ్యూజిక్(డోలు)లో డిప్లమో చేశారు. అనంతరం తమిళనాడులోని అన్నామలై యూనివర్శిటీ, చిదంబరంలో డోలు వాయిద్యంపై పీజీ పూర్తిచేశారు. అయితే డోలు వాయిద్యంలో పీజీ చేసిన తొలి మహిళగా గుర్తింపు తెచ్చుకున్నారు. మొదట డోలు విద్వాంసులు టీఆర్ సుబ్రహ్మణ్యం దగ్గర డోలు నేర్చుకున్నారు. చిదంబరంలో డోలు విద్వాంసులు టీజీ బాబు దగ్గర కూడా కొంత కాలం డోలు వాయిద్యంలో తాళాలు నేర్చుకున్నారు. డోలు వాయిద్యంలో 108 తాళాలుంటే, వాటిలో 35 తాళాలు అప్పట్లోనే నేర్చుకుని, మిగిలిన తాళాలు పూర్తిచేసేందుకు కృషి చేస్తున్నారు.


తల్లి, తండ్రి కుటుంబ సభ్యులతో కలసి కచేరీ చేస్తూ...



తెలంగాణ రాజ్‌భవన్‌లో పూర్వ గవర్నర్ తమిళిసై నుంచి సత్కారం అందుకుంటున్న మనీషా

పురస్కారాలు... ప్రశంసలు

మనీషా డోలు వాయిద్య విద్యలో పీజీ చేయక ముందు నుంచే అనేక కచేరీలు చేశారు. చిన్నతనంలోనే ఎందరో ప్రముఖుల మన్ననలు పొందారు. తన డోలు ప్రావీణ్యానికి మెచ్చిన న్యూ లైఫ్ సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందించింది. 2019లో సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగిన ఇంటర్నేషనల్ మథర్ తెరీసా గోల్డ్‌మెడల్ అవార్డ్ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ చూపి గోల్డ్ మెడల్‌ను సాధించారు. సిలికానాంధ్ర ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన నాదశ్వర డోలు వాయిద్యం ప్రదర్శనలో గిన్నిస్ రికార్డును సొంతం చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, తమిళనాడు పూర్వ గవర్నర్ తమిళిసై వంటి ప్రముఖుల చేతులు మీదగా పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, భద్రాచలం, కాశీ, పూరి, హరిద్వార్, ద్వారకలో జరిగిన కార్యక్రమాల్లోనూ ప్రతిభ చూపారు. యువతకు ఆదర్శంగానిలిచారు.

ఓటర్లుగా అర్హులైన పట్టభద్రులు

- 80 శాతం పట్టభద్రుల దరఖాస్తులు పరిష్కారం
- నేటి సాయంత్రానికి ముసాయిదా ఓటరు జాబితా
- 23న ప్రచురణకు చర్యలు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కలెక్టరు


రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్ నాగలక్ష్మి, డీఆర్‌వో కాజావలి

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా - గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి సభ్యుని ఎన్నికకు అర్హులైన పట్టభద్రులను ఓటరుగా నమోదు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచిం చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు నమోదు నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబరు 30 నుంచి నవంబరు 6వ తేదీ వరకు పట్టభద్రుల శాసనమండలి ఓటుకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చి నవంబరు 20న ముద్రించి 23న ప్రచురి స్తారన్నారు. ఇప్పటి వరకు 2,83,100 మంది ఆన్‌లైన్ ద్వారా ఓటుకు దరఖాస్తు చేసుకోవడం జరిగిందని, ఆఫ్‌లైన్‌లో 48,900 మంది కలిపి మొత్తం 3 లక్షల 32 వేల మంది దరఖాస్తు చేస్తుకున్నారన్నారు. ఇందులో 80 శాతం దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించామని, మిగిలిన 20 శాతం దరఖాస్తులను బుధవారం సాయంత్రానికి పూర్తి చేసి డ్రాఫ్ట్ ఓటరు జాబితా ముద్రణ కోసం పంపుతామన్నారు. నవంబరు 23వ తేదీ నుంచి డిసెంబరు 9వ తేది వరకు ముసా యిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, డిసెంబర్ 25వ తేదీ నాటికి పరిష్కరించి, ఆ నెల 30న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలియజేశారు.

2019 ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో 2,48,799 మంది ఓటర్లకు గాను 362 పోలింగ్ కేంద్రాలను వినియోగించడం జరిగిందని, 2025 ఎన్నికలకు 3 లక్షల 32 వేల మంది ఓటర్లకు ఆరు జిల్లాల్లో 421 పోలింగ్ స్టేషన్లు ప్రతిపాదించామన్నారు. అయితే తుది ఓటర్ల జాబితా ప్రచురితమయ్యే నాటికి పోలింగ్ కేంద్రాల సంఖ్యలో మార్పులు జరగొచ్చన్నారు. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో 900 మంది ఓటర్లు ఓటు వేసే అవకాశం వుందన్నారు.

సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, డాక్టర్ టి సేవాకు మార్ (ఏఏపీ), చిరుతనగండ్ల వాసు(బీఎస్‌పీ), బీ పాండురంగ విఠల్(బీజేపీ), వై కృష్ణకాంత్(సీపీఎం),బీ.సునీల్ కుమార్(కాంగ్రెస్), కంచర్ల శివరామయ్య (టీడీపీ),ఏఈఆర్వోలు, ఎలక్షన్‌సెల్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు


గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నవంబరు, డిసెంబరు, జనవరి నెలల్లో శబరిమల యాత్రకు వెళ్లే యాత్రీకుల సౌకర్యార్థం ఏటా రైల్వే శాఖ నడిపే ప్రత్యేక రైళ్లకు సంబంధించి ఈ ఏడాది ప్రకటన విడుదలైంది. నంబరు. 07145 మచిలీపట్నం - కొల్లం ప్రత్యేక రైలు ఈ నెల 25, డిసెంబరు 2, 9, 16 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌కు వచ్చి 6.02కి బయలుదేరుతుంది. నెంబరు. 07146 కొల్లం - మచిలీపట్నం ప్రత్యేక రైలు ఈ నెల 27, డిసెంబరు 4, 11, 18 తేదీల్లో (బుధవారం) వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం వేకువజామునకు ముందు 2.50కి న్యూగుంటూరుకు వస్తుంది.

ఈ రైళ్లకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో తెనాలి, బాపట్ల, చీరాలలో నిలుపుదల సౌకర్యం కల్పించారు. ఈ నెల 22, 30 తేదీల్లో నవంబరు. 07147 మచిలీపట్నం - కొల్లాంస్పెషల్ మధ్యాహ్నం 3.15కి గుంటూరు, సాయంత్రం 4 గంటలకు నరసరావుపేట, 4.45కి వినుకొండ, మరుసటి రోజు రాత్రి 9.20కి కొల్లాం చేరుకొంటుంది. నంబరు. 07148 కొల్లాం - మచిలీపట్నం స్పెషల్ ఈ నెల 25, డిసెంబరు 1 తేదీల్లో(బుధవారం) వేకువజామునకు ముందు 2.30కి బయలుదేరి గురువారం ఉదయం 6.08కి వినుకొండ, 6.38కి నరసరావుపేట, 8 గంటలకు గుంటూరుకు చేరుకొంటుందని డీఆర్‌ఎం ఎం రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పేరేచర్ల లేఅవుట్‌లో విద్యుత్ తీగల చోరీ

- నిర్మాణాలు నామమాత్రమే.. ● లైన్లు, ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు
- ఇదే అదనుగా చెలరేగిపోతున్న విద్యుత్ తీగెల చోరీ ముఠా


పేరేచర్ల లేఅవుట్‌లో వేసిన విద్యుత్ స్తంభాలు, వరుసగా అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్లు



మేడికొండూరు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని పేదల కోసమంటూ మేడికొండూరు మండలంలోని పేరేచర్లలో ఏర్పాటు చేసి లేఅవుట్‌లో విద్యుత్ తీగెల(కండక్టర్)ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. లేఅవుట్‌లో 18 వేల ప్లాట్లను పేదలకు కేటాయించినా గృహా నిర్మాణాలు నామ మాత్రంగానే జరిగాయి. అయినా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌పార్మర్ల ఏర్పాటు చేశారు. ఇదే అదనుగా విద్యుత్ తీగెలు చోరీ చేసే ముఠా చెలరేగిపోతున్నది. రోడ్ల నిర్మానాలు పూర్తి కాకపోయినా కేవలం హద్దు రాళ్ల ఆధారంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి ట్రాన్స్‌పార్మర్లను బిగించారు. భారీ సబ్ స్టేషన్ నిర్మాణం కూడా జరిగిపోయింది. ఈ సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాకు కిలో మీటర్ల పొడవున విద్యుత్ వైర్లను వేశారు. అక్కడ ఇళ్లు నిర్మాణాలు జరగకపోవడంతో జన సంచారం అంతగా లేదు. దీంతో విద్యుత్ తీగెల చోరీ ముఠాను అడ్డుకునే వారే లేకుండా పోయారు. ఇప్పటి వరకు సుమారు 4 కిలో మీటర్ల పొడవున లక్షల విలువైన కండక్టర్ వైరు చోరీ జరిగిందని అధికారులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరా అవుతున్నా లైన్లలో కండక్టర్ దొంగలించాలి అంటే సాధారణ వ్యక్తులు సాహసించరని, విద్యుత్ లైన్ల గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే చోరీకి పాల్పడుతుంటారని విద్యుత్ అధికారులు అంటున్నారు. ఎటునుంచి విద్యుత్ సరఫరా అవుతున్నది, ఎక్కడ సరఫరా నిలిపి వేయాలి, స్తంభాలపై ఉన్న వైరును కిందకు ఎలా దింపాలో పూర్తిగా తెలిసిన వ్యక్తులు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదుపై పోలీసులు ఆసక్తి చూపడం లేదు. లైన్లలో విద్యుత్ ఉండగా ఎలా చోరి జరుగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో చోరీ జరిగినా అప్పట్లో పోలీసులు ఫిర్యాదు స్వీకరించలేదు. తాజాగా డోకిపర్రు ఏఈ ఇచ్చిన ఫిర్యాదును తీసుకున్నారు. దీనిపై ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

అంతర్రాష్ట్ర బియ్యం సరఫరా

ముఠా అరెస్టు

- ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో సరిహద్దు దాటిస్తున్న వైనం
- అక్టోబరులో జరిగిన ప్రమాదంలో ముఠా గుట్టురట్టు


రేషన్ బియ్యం దందా వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్రంలో ముగ్గురు నిందితులు

మిర్యాలగూడ అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని వాహనంలో అర్థరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటించి దందాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని తన కార్యాలయంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు కేసు వివరాలు మంగళవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లి గ్రామానికి చెందిన మందపాటి నర్సింహారావు, అదే గ్రామానికి చెందిన కల్లూరి లింగయ్య రేషన్ బియ్యం దందా చేస్తుంటారు. వారి కదలికపై పోలీసులు రెండు నెలలుగా నిఘా ఉంచి వాడపల్లి వద్ద మంగళవారం అరెస్టు చేశారు. దామరచర్ల మండలం బడావత్‌తండాకు చెందిన బడావత్ సర్దార్, మినీ ట్రాన్స్‌పోర్టు వాహన డ్రైవర్ దేవరకొండ అమరయ్య, హమాలీ ముఠామేస్త్రీ సైదారావుతో కలిసి బియ్యం దందా కొనసాగిస్తున్నారు. దామరచర్ల, అడవిదేవులపల్లి, మిర్యాలగూడ మండలాల పరిసర ప్రాంతాలకు చెందిన లబ్ధిదారులనుంచి రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.10కి చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. ప్రతినెల గ్రామాల్లో తిరిగి సేకరించిన బియ్యాన్ని ఏపీ 39యూఎఫ్ 8418నెంబర్‌గల అశోక్‌లీల్యాండ్ మినీగూడ్స్ వాహనం ద్వారా రాష్ట్ర సరిహద్దు దాటించేవారు. ఆ వాహనంలో రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తున్న క్రమంలో అక్టోబరు 24వ తేదీన దామరచర్ల గ్రామశివారులోని నర్సాపురం ఎక్స్‌రోడ్డు వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో హమాలీ కూలీ షేక్ నాగులు మృతిచెందగా, మరికొంతమందికి గాయపడ్డారు. వాడపల్లి పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్ అమరయ్యను అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో రేషన్ బియ్యం రవాణా దందా వెలుగులోకి వచ్చి, నిందితుల వివరాలు బయటపడినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులు ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన నర్సింహారావు, లింగయ్యను అరెస్టు చేసి రెండు సెల్‌ఫోన్లు రికవరీ చేశారు. అనంతరం వారిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై వాడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దందాలో స్థానికంగా మరికొందరి పాత్ర ఉన్నట్లు విచారణలో తేలిందని, నిందితుల ఫోన్ కాల్ రికార్డు ఆధారంగా సూత్ర, పాత్రదారులను గుర్తించి త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

మరో బియ్యం వ్యాపారిని అరెస్ట్..

నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండల కేంద్రంగా రేషన్‌బియ్యం రవాణాకు పాల్పడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతలకు చెందిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. రెంటచింతల గ్రామానికి చెందిన బియ్యం వ్యాపారి తిప్పబత్తుల వెంకటనారాయణ అలియాస్ నారాయణ నల్లగొండ జిల్లా అడవిదేవులపల్లి మండలం బాల్నేపల్లి గ్రామానికి చెందిన రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తిఓ కలిసి రేషన్‌బియ్యాన్ని అర్థరాత్రి రాష్ట్ర సరిహద్దు దాటిస్తుంటారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం బాల్నేపల్లి గ్రామశివారులో శిథిలావస్థలో ఉన్న ఓ ఇంట్లో నిల్వచేసిన సుమారు నాలుగు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపట్టగా బియ్యాన్ని రమావత్ కోటేశ్వర్‌రావు, రమావత్ ధనమూర్తి సేకరించి డంప్ చేసినట్లు తేలిందన్నారు. వ్యాపారి వెంకటనారాయణ స్థానికంగా ఏర్పాటు చేసుకున్న ముఠాసభ్యులతో రేషన్‌బియ్యాన్ని సేకరించి ఏపీకి చెందిన అంగోతు రాంబాబు, పెంటబోయిన సైదారావుల సహకారంతో ఏపీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్న బియ్యం వ్యాపారి వెంకటనారాయణను అడవిదేవులపల్లి వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిసారు. ఈ రెండు కేసుల్లో ప్రధాన నిందితులకు సహకరించిన వ్యక్తులను గతంలో అరెస్టు చేసి రిమాండ్ చేశామన్నారు. రేషన్‌బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏపీ రాష్ట్రానికి చెందిన ముగ్గురు ప్రాధాన నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి, అడవిదేవులపల్లి ఎస్‌ఐలు హరికృష్ణ, శేఖర్‌లను డీఎస్పీ అభినందించారు.

అభాగ్యులకు.. ఆసరా

- మిషన్ వాత్సల్యలో 318 మందికి లబ్ధి
- రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- దరఖాస్తులతో సరిపెట్టిన గత వైసీపీ పాలకులు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి) కరోనా మహమ్మారిలో తల్లిదండ్రులు కోల్పోయి అనాథలుగా మారిన వారు కొందరైతే, తల్లిదండ్రుల్లో ఒకరిని కోల్పోయి అభాగ్యులుగా మారిన వారు మరికొందరు. వీరే కాక రకరకాల కారణాలతో అనాథలుగా బతికేవారు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు ఇలాంటి వారందరినీ అక్కున చేర్చుకుని అండగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 2022లో మిషన్ వాత్సల్య పథకానికి శ్రీకారం చుట్టాయి. అయితే కేంద్రం మిషన్ వాత్సల్య పథకానికి రూపకల్పన చేసినా వైసీపీ పాలకులు చిన్నారులకు సాయం అందించే బాధ్యతను మరిచారు. ప్రభుత్వ ప్రాథామ్యాలలో ఒకటిగా ఉండాల్సిన ఈ పథకాన్ని నీరుగార్చారు. మొక్కుబడిగా దరఖాస్తుల స్వీకరణతో సరిపెట్టిందే తప్ప పిల్లల బాగోగులు చూడడంలో పూర్తిగా విఫలమైంది. సంరక్షకుల నీడలో ఉండే చిన్నారులు ఆ డబ్బులు కోసం కళ్లు కాయాలు కాచేలా ఎదురుచూసినా, కార్యాలయాల చుట్టూ తిరిగినా గత పాలకులు మనసు కరగలేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఆయా దరఖాస్తులపై దృష్టి సారించింది. తొలివిడతలో జిల్లాలో మొత్తం 490 దరఖాస్తులు వచ్చినట్లు తేల్చారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా 318 మంది అంతిమంగా ఆ పథకానికి అర్హులుగా తేలారు. జాబితా కేంద్రానికి పంపడం, వెంటనే నిధులు మంజూరు చేయించింది. 318 మంది చిన్నారుల సంరక్షకుల ఖాతాల్లో 78 లక్షల నగదును ఈ ఏడాది సెప్టెంబరు 3నే జమ చేసినట్లు ఐసీడీఎస్ విభాగం తెలిపింది. ఇందులో అనాథలు 61 మంది ఉండగా, కొవిడ్ వల్ల అభాగ్యులుగా మిగిలినవారు 80 మంది, హెచ్‌ఐవీ ఎఫెక్టెడ్ 27, తల్లి లేదా తండ్రిలో ఒకరిని కొల్పోయిన చిన్నారులు 150 మందికి మిషన్ వాత్సల్య పథకం కింద నగదును జమ చేసింది.

ఆరు నెలలకు ఒకేసారి...

వాస్తవానికి మిషన్ వాత్సల్య పథకం తాలూక నగదు గతేడాది అక్టోబరులోనే లబ్ధిదారులకు అందాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం మూలంగా ఇది పేపర్లకే పరిమితమైంది తప్ప అమలుకు నోచుకోలేదు. నెలకు రూ.4,000 చొప్పున గతేడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు అంటే ఒకేసారి ఆరు నెలలకు సంబంధించి నగదును ఒకేసారి చిన్నారుల సంరక్షకుల ఖాతాల్లో జమ అవడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండో విడత లబ్ధిదారుల ఎంపిక కూడా వేగవంతంగా జరుగుతుంది. ఇది 2024-25కు సంబంధించిన ప్రక్రియగా అధికారులు చెబుతున్నారు. నిధుల లభ్యత దృష్ట్యా కేవలం 25 మందికే ఈ దఫాలో అవకాశం కల్పించడానికి వీలుందని ఐసీడీఎస్ విభాగం చెబుతోంది. వీటికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు కూడా అక్టోబరు 25తో ముగిసింది. మొత్తం 70 దరఖాస్తులు వచ్చాయని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి వీరిలో 25 మందిని ఎంపిక చేయడానికి కసరత్తు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు

పథకానికి అర్హతలివే

2025 మార్చి 31కి 18 ఏళ్ల వయసులోపునే ఉండాలి. తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దంపతుల పిల్లలు, సదరు కుటుంబం వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో అయితే రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించనివారై ఉండాలి. ఎవరైతే నిరాదరణకు గురవుతున్న పిల్లలున్నారో వారు తప్పనిసరిగా ప్రభుత్వ స్కూల్‌లోనే విద్యనభ్యసిస్తూ ఉండాలి.

పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన



ఇప్పటికే ఖాతాల్లో నగదు జమైన లబ్ధిదారుల ఎంపికను కూడా పూర్తి పారదర్శకంగా నిర్వహించాం. జిల్లాలోని 9 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో రెండో విడతలో దరఖాస్తులు స్వీకరించాం. వాటిని నిబంధనల ప్రకారం పరిశీలించి తుది జాబితా ప్రకారం వారికి మిషన్ వాత్సల్య పథకం అందేలా చూస్తాం.

\- కే.ఉమ, ఐసీడీఎస్ పీడీ

కార్పొరేషన్లకు సభ్యుల నియామకం

గుంటూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో నాలుగు కార్పొరేషన్లకు సభ్యులను నియమించగా, ఉమ్మడి గుంటూరుకు చెందిన పలువురు స్థానం పంపాదించుకున్నారు. యాదవ కార్పొరేషన్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి టీడీపీ నేత తాడిబోయిన భాస్కరరావు, గౌడ కార్పొరేషన్లో చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి టీడీపీ నేత కందుల వెంకట రమణ, గుంటూరు తూర్పు నియోజకవర్గం నుంచచి లక్ష్మీశైలజ గౌడ్, మాల కార్పొరేషన్లో పొన్నూరు నియోజకవర్గం నుంచి టీడీపీ నేత బండ్లమూడి బాబూరావులు సభ్యులుగా నియమితులయ్యారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

24న సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణం చిలకలూరిపేట బైపాస్ రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా సీనియర్ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక జరుగుతుందని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ మంతెన సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. అదనపు సమాచారం కోసం 9502925925 నంబరును సంప్రదించాలన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

కోటప్పకొండకు రోప్‌వే నిర్మించాలి

● తిరునాళ్లకు నిధులు కేటాయించాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత శైవక్షేత్రం కోటప్పకొండకు రోప్‌వే నిర్మించాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు కోరారు. ఈ మేరకు అసెంబ్లీలో మంగళవారం అరవిందబాబు ప్రతిపాదించారు. రోప్‌వే నిర్మించాలన్నది డాక్టర్ కోడెల శివప్రసాదరావు, పల్నాడు వాసుల కల అని పేర్కొన్నారు. రోప్‌వే నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కోటప్పకొండలో శివరాత్రికి జరిగే త్రికోటేశ్వరస్వామి తిరునాళ్లకు నిధులు కేటాయించాలన్నారు. తిరునాళ్లకు ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని గుర్తు చేశారు. తిరునాళ్ల నాటికి కొండకు ఉన్న రహదారులను అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. తిరునాళ్ల ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయాల్సి ఉందని చెప్పారు. తిరునాళ్ల నిర్వహణకు దేవదాయ శాఖ బడ్జెట్ కేటాయించాలని అరవిందబాబు కోరారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎండీకి డాక్టరేట్

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్‌కు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆంధ్ర యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జాలాది రవి ఆధ్వర్యంలో ఆక్యుపేషనల్ స్ట్రెస్ అండ్ ఇట్స్ ఇన్ఫులియెన్స్ ఆన్‌వర్క్ లైఫ్ బాలెన్స్ అమాంగ్ టీచర్స్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్‌లో చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేశారు. షేక్ మస్తాన్ షరీఫ్ డాక్టరేట్ సాధించడంపై తండ్రి, కళాశాల చైర్మన్ షేక్ మీరావలి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

దివ్యాంగులకు ఆరోగ్య శిబిరం

నరసరావుపేట లీగల్, నవంబరు 19: మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పెద్ద చెరువులోని ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో దివ్యాంగులకు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు చక్రవర్తి, గ్రేస్, గాయత్రి, బషీర్ నిషా న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, ఇందిర పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన అందరికీ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 13వ అదనపు జిల్లా న్యాయఅధికారి సత్యశ్రీ కృతజ్ఞతలు తెలిపారు.



జొన్నలగడ్డలో మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్), నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన నల్లపాటి విజయమ్మ మెడలో బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. జొన్నలగడ్డ గ్రామానికి చెందిన నల్లపాటి విజయమ్మ గ్రామంలో గాంధీబొమ్మ సెంటరులో తాగునీటి ప్లాంటు నడుపుతోంది. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తాగునీరు కావాలని అడిగి ఆమెను మాటల్లోపెట్టి మెడలో బంగారు గొలుసు లాక్కుని వెళ్లారు. పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

అక్రమ మద్యం కేసులో వ్యక్తి అరెస్టు

ఈపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రొంపిచర్లలో మంగళవారం దాడులుచేసి వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ డీ వెంకటేశ్వర్లు తెలిపారు. రామిరెడ్డి అనే వ్యక్తి వద్ద 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దాడులలో ఎస్ఐ కే.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురంలో ఆటో దహనం

శావల్యాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందుంచిన ఆటోకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఆటో పూర్తిగా దహనమైన సంఘటన మండల కేంద్రమైన శావల్యాపురంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు శావల్యాపురం బీసీ కాలనీకి చెందిన వేముల శ్రీనివాసరావు రోజూమాదిరిగానే తన ఇంటిముందు ఆటోను ఉంచి ఇంట్లో నిద్రిస్తున్నాడు. తెల్లవారుజామున ఆటోలో నుంచి మంటలు చెలరేగడంతో శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు, ఇరుగు పొరుగువారు అక్కడకొచ్చి చూసేసరికి ఆటో పూర్తిగా కాలిపోయింది. బాధితులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ లేళ్ల లోకేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. బాధితుని ఫిర్యాదుమేరకు కేసును నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకరంగా ఎన్‌ఎస్‌పీ కాలువ వంతెన

❒ శిథిలావస్థలో పలు వంతెనలు

❒ వంతెనలపై గోడలు లేక ప్రమాదాలు

❒ అధికారులు స్పందించాలని రైతుల డిమాండ్

నూజెండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్‌పీ కాలువల ఆధునికీకరణలో కాలువల మరమ్మతులు, లైనింగ్, షట్టర్లు ఏర్పాటుచేసిన అధికారులు కాలువలపై వంతెనల పునఃర్నిర్మాణానికి శ్రద్ధ చూపకపోవటంతో అవి ప్రమాదకరంగా మారాయి. ముఖ్యంగా జమ్మలమడుగు మేజరుపై నూజెండ్ల - అప్పాపురం మార్గం, మారెళ్ళవారిపాలెం - తలార్లపల్లి గ్రామంలో వంతెనలు శిథిలావస్థకు చేరాయి. అంతేకాకుండా వంతెనపై సైడు గోడలు లేకపోవటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



నూజెండ్ల, అప్పాపురం మార్గంలో జమ్మలమడుగు మేజరుపై ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

అధికారులకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం

నరసరావు పేట రూరల్, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని జాషువా సమావేశ మందిరంలో హౌసింగ్, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, జియో ట్యాగింగ్, ఎన్సీసీఐ మ్యాపింగ్, ఉపాధి హామీ వేతనాల చెల్లింపులపై జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది డిసెంబరు 31నాటికి జిల్లాలో పేదలకు మంజూరైన ఇళ్లలో 5,650 ఇళ్లను నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడాది పూర్తయ్యేనాటికి 15,800 ఇళ్లకు స్టేజ్ కన్వర్షన్ చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు వారం వారం లక్ష్యాలు నిర్దేశించుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా ఎక్కువమంది కూలీలకు ఉపాధి, పూర్తి మొత్తంలో వేతనాలు అందించేలా చూడాలన్నారు. ఉపాధి హామీలో అవకతవకలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఉపాధి పథకం ద్వారా వేతనాలు చెల్లించిన దాఖలాలు కనిపించడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. మండలాల్లో పరిస్థితులను ఎంపీడీవోలు చక్కదిద్దకపోతే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు, ఆర్డీవోలు, మండల స్పెషల్ ఆఫీసర్లు, డీఎల్డీవోలు తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ళ నిర్మాణాలపై జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

శాఖా గ్రంథాలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆత్మీయ అతిథులుగా పల్నాడు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి అట్లూరి దీప్తి, నరసరావుపేట రేంజ్ అటవీ క్షేత్ర అధికారి డీ వెంకటరమణ, పల్నాడు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ డీ సునీత, పల్నాడు జిల్లా లీగల్ అడ్వైజర్ టీ అమూల్య హాజరయ్యారు. మహిళా దినోత్సవం సందర్భంగా మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ అధ్యక్షతన రంగోలి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అభ్యుదయ భారతి అధ్యక్షుడు రత్నాకరం రాము, హనుమంతురావు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాలలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఆన్‌లైన్‌లో జాతీయ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు. నేటి నుంచి పది రోజుల వరకు క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో కళాశాల, పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని సర్టిఫికెట్‌లు ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని చెప్పారు. కళాశాల గ్రంథాలయంలో మహాత్మాగాంధీ జీవితంలోని ముఖ్య ఘట్టాలను వివరిస్తూ అరుదైన 100 ఫొటోలతో ప్రదర్శన, 111 మంది తెలుగు సాహిత్య మూర్తులు రచనలపై ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ నెలరోజులపాటు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాససాయి, గ్రంథాలయ అధికారి పోతిరెడ్డి రామాంజనేయరెడ్డి, డాక్టర్ పీఎస్ వీడీ మహేష్, కే మోహనరావు, ఎం.అనిల్‌కుమార్, ఎన్.శ్రీనివాసరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు

● రొంపిచర్ల: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మండలంలోని సంతగుడిపాడులో విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. రొంపిచర్లలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్ పోటీలు, పరుగు పందెం పోటీలను నిర్వహించారు.

● నాదెండ్ల: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు చిత్రలేఖనం, బాలురకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

● యడ్లపాడు: శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ అంజమ్మ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాల, నారాయణ ఇంగ్లీషు మీడియం, సెయింట్ ఆన్స్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభారతి, ప్రిన్సిపల్ సీహెచ్ సుజన, రోజ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



నరసరావుపేటలో మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ముఖ్యఅతిథులు

● ఈపూరు: ఈపూరు, ముప్పాళ్ళ గ్రంథాలయాలలో మంగళవారం విద్యార్థులకు నృత్యప్రదర్శన, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ముందుగా ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు తహసీల్దారు నళిని పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు ఎస్ నాగలక్ష్మి, గంటా వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని శాఖా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏపీ మోడల్ స్కూల్ నందు బాలికలకు రంగ వల్లులు, అల్లికలు పోటీలు నిర్వహించారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాండు రంగారావు, గ్రంథాలయ నిర్వాహకులు రామావత్ సేవానాయక్, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● జొన్నలగడ్డ (నరసరావుపేట రూరల్): మండలంలోని జొన్నలగడ్డలోని జిల్లా పరిషత్ హైస్కూలులో ఝాన్సీలక్ష్మీబాయి, ఇందిరాగాంధీ చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎ.గురులింగం, జి.శ్రీనివాసరెడ్డి, ఎస్‌వీ సుబ్బారెడ్డి, అపర్ణ, ఉష, శాంతకుమారి, గోవిందరెడ్డి, బాలస్వామి, జి.మస్తాన్‌రావు, ఎస్‌కే ఫాతిమూన్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ జూడో జట్టుకు కృష్ణవేణి విద్యార్థి ఎంపిక


నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జూడో జట్టుకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి పీ శ్రావణ్‌కుమార్ ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఏఎన్‌యూ అంతర కళాశాలల జూడో పోటీలలో అండర్ 90 వెయిట్ కేటగిరిలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి ఈ ఘనత సాధించాడన్నారు. ఎంపికైన పీ శ్రావణ్‌కుమార్ ఎల్ఎన్‌సీటీ భూపాల్‌లో ఈ నెల 27 నుంచి 30వరకు నిర్వహించే అఖిలభారత అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో ఏఎన్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పీ శ్రావణ్‌కుమార్‌ను కళాశాల పీడీ ఈదర ఆదిబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు తదతరులు అభినందించారు.



శ్రావణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, పీడీ ఈదర ఆదిబాబు తదితరులు

కొత్తపల్లి, ఎడ్వర్డుపేట గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

రొంపిచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి, ఎడ్వర్డుపేట గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏవో శివలలిత ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరి పొలాలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

● ఢిల్లీ పబ్లిక్ స్కూలు చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాశరావు

నరసరావుపేట రూరల్, నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతోపాటుగా క్రీడల్లోనూ రాణించాలని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాషరావు తెలిపారు. ఈ నెల 17వ తేదీన చిలకలూరిపేటలోని మార్కెట్ యార్డ్‌లో జరిగిన 18వ రాష్ట్రస్థాయి అండర్-12, అండర్-17 పలు పోటీలను నిర్వహించారు. పోటీలకు రాష్ట్రంలోని 8జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొనగా ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున ఫ్లోర్‌బాల్ పోటీలలో పాల్గొని అండర్-17 బాలుర విభాగంలో, బాలికల విభాగంలో ద్వితీయ స్థానం అలాగే అండర్-12 బాలుర విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. మంగళవారం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కేసానుపల్లిలో జరిగిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్‌రావు, డైరెక్టర్ నాగోతు సబిత గెలుపొందిన బాల బాలికలను అభినందించారు.

26న జరిగే రైతుల నిరసన సభను విజయవంతం చేయండి

మతుకుమల్లి (శావల్యాపురం), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన నరసరావుపేటలో జరగనున్న రైతుల నిరసన సభను రైతులంతా పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి కేవీఆర్ మోహన్‌చంద్ పిలుపునిచ్చారు. మతుకుమల్లిలో సంగం డెయిరీ సెంటర్ వద్ద సోమవారం రాత్రి రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో బి.వెంకటేశ్వర్లు, పి.శ్రీనివాసరావు, ఎం.వెంకట్రావు, రామాంజనేయులు, పి.కోటేశ్వరరావు, సుబ్బారావు, మల్లయ్య, పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో ప్రతిరోజు తాగునీటి సరఫరా కోసం కసరత్తు: డీఈ

చిలకలూరిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మరో ఆరు నెలలలో చిలకలూరిపేట పట్టణంలో ప్రతిరోజు తాగునీటి సరఫరా జరపాలని నిర్ణయించినట్లు చిలకలూరిపేట మున్సిపల్ డీఈ అబ్దుల్ రహీం మంగళవారం చెప్పారు. డీఈ అబ్దుల్ రహీం మాట్లాడుతూ జోనల్ పద్ధతిలో ప్రతిరోజు నీటి సరఫరా జరపటానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం చిలకలూరిపేటలో సుమారు 16,500 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. ఇవి గాక మరో రెండు వేలు అనధికార కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. అధికారులు వీటిని క్రమబద్ధీకరించే పనిలో ఉన్నారు. పట్టణానికి రెండు తాగునీటి చెరువులు ఉన్నాయి. సుమారు 100ఎకరాలలో పాత చెరువు, 200ఎకరాలలో కొత్తచెరువులు ఉన్నాయి. ఈ రెండు చెరువులను ఏటా నాలుగు సార్లు నాగార్జున సాగర్ కాలువ నీటితో మోటార్లతో తోడి నింపుతున్నారు. ఇందుకోసం ఏటా రూ. 1.5 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్టుగా ప్రతిరోజు నీటి సరఫరా ప్రారంభమైతే పట్టణ ప్రజలకు ఒక ప్రధాన సమస్య పరిష్కారమవుతుందన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన సదస్సు

వినుకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఇంటికి తప్పనిసరిగా మరుగుదొడ్లు నిర్మించుకొని అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల కోఆర్డినేటర్ ప్రభాకర్ తెలిపారు. మండలంలోని అందుగులపాడు, శివాపురం గ్రామ పంచాయితీల్లో వరల్డ్ టాయిలెట్ డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి అంటువ్యాధులపై అవగాహన కార్యక్రమం కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు రమేష్, శేషిరెడ్డి పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: ప్రజలంతా మరుగుదొడ్లను వినియోగించుకోవాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి స్థానిక జడ్పీపాఠశాల వరకు విద్యార్థులతో కలసి ర్యాలీని నిర్వహించి ప్రజలకు మరుగుదొడ్ల వినియోగం, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ఈవోపీఆర్డీ సుగుణ, ఎంఈవో సాంబశివరావు, హెచ్ఎం విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి యాకోబు, మండలరిసోర్స్ కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాసరయ్య తిరునాళ్ళ

బొల్లాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమలచెరువులో నాసరయ్య తిరునాళ్ళ మంగళవారం ఘనంగా నిర్వహించారు. తిరునాళ్ళ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి పొంగళ్లు చేశారు. సాయంత్రం గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో రెండు భారీ విద్యుత్ ప్రభలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్ఐ ఏ బాలకృష్ణ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాత శివాలయంలో నూతన పూజారి నియామకం

వినుకొండటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత శివాలయం అర్చకుడు మద్యం సేవించి విధులకు హాజరుకావడంపై దేవదాయశాఖ అధికారులకు ఎట్టకేలకు స్పందించారు. లిఖిత పూర్వకమైన వివరణ ద్వారా సమాచారం తెలుసుకున్న అధికారులు పూజారి చంగపల్లి వెంకట శివరామ ప్రసాద్‌ను తాత్కాలికంగా విధులు నుంచి తొలగిస్తూ ఆయన స్థానంలో తాత్కాలికంగా వేలమోరి వెంకటశేషసాయి శర్మను నియమించినట్లు దేవస్థాన కార్యనిర్వహణ అధికారి సుదాకర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. స్వామివారి వెండి ఆభరణములను ఆలయ మాజీ చైర్మన్ బాలసుబ్రహ్మణ్యం, పావణిల సమక్షంలో తాత్కాలిక పూజారికి అప్పగించారు.

తెగుళ్ళపై అవగాహన కలిగి ఉండాలి: ఏవో రామారావు

ఈపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ వనికుంట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పొలాలను పరిశీలించిన మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ వరి పైరుకు సోకే ఆకుముడత, అగ్గితెగులు నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు.

రోడ్డు మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బొల్లాపల్లి మండలంలోని మన్నెపల్లి తండాలో సిమెంట్ రోడ్డు రోడ్డు మధ్యన అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. దీనిని తొలగించాలని గ్రామస్థులు ఎన్నిసార్లు విద్యుత్ అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకునే అధికారులు కరువయ్యారన్నారు. గ్రామంలోని చాలామంది రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బారినుంచి ఇప్పటికే చాలా సార్లు తప్పించుకున్నామంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- బొల్లాపల్లి, ఆంధ్రజ్యోతి

సమస్య ఇది.. స్పందించరూ

రిమాండ్ ఖైదీకి మాజీ మంత్రి విడదల రజిని పరామర్శ

నరసరావుపేట లీగల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవోను దూషించిన కేసులో అరెస్టయి, నరసరావుపేట సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ నాయకుడు సింగారెడ్డి కోటిరెడ్డిని మంగళవారం మాజీ మంత్రి విడుదల రజిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోటిరెడ్డిపై అక్రమంగా కేసు బనాయించారన్నారు. వైసీపీ నాయకులను కూటమి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం జైలుకు పంపుతున్నారని విడదల రజని ఆరోపించారు.

అన్ని ప్రాజెక్టులను మూలన పడవేసిన జగన్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కమిషన్‌ల కోసం అన్ని ప్రాజెక్టులను మాజీ సీఎం జగన్ మూలనపడేశాడని, ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేశాడని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అసెంబ్లీలో జలవనరుల శాఖపై చర్చ సందర్భంగా ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 62 ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి 23 ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేశామని, రూ.68,292 కోట్లు ఖర్చుచేసి కొత్త ఆయకట్టుకు నీరు అందించటంతో పాటు 32 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరించామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎక్కువగా ఉన్నాయని, వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్న ఇరిగేషన్ ప్రాజెక్టులపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా నాగార్జున సాగర్ కుడి కాల్వ చివరి ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు అవసరమైన కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మతులను కూడా గత ఐదేళ్లలో చేపట్టక పోవటంతో నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జలవనరుల శాఖ వీటిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రత్తిపాటి తెలియజేశారు.

అవినీతి ఆరోపణల పై డీఎల్‌పీవో విచారణ

నాదెండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందవరం గ్రామ పంచాయతీలో పాలకవర్గం, కార్యదర్శులు, వైసీపీ నాయకులు లక్షల్లో అవినీతికి పాల్పడ్డారని చేసిన ఫిర్యాదుపై మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి లక్ష్మణరావు విచారణ జరిపారు. రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన యన్నం రమణారెడ్డి జిల్లా కలెక్టర్, డీపీవోలకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో గ్రామానికి వచ్చిన డీఎల్‌పీవో, ఈవోపీఆర్‌డీ, ఇన్‌చార్జ్ కార్యదర్శి పంచాయతీ కార్యాలయానికి రమణారెడ్డిని పిలిపించి ఆరోపణలపై వాంగ్మూలం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అనధికారికంగా నీటి కుళాయిలు ఇచ్చి సుమారు రూ.10లక్షలు వసూలు చేశారని పలు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై క్షుణ్ణంగా దర్యాప్తు జరపాలని ఈవోపీఆర్‌డీ లక్ష్మీకుమారి, ఇన్‌చార్జ్ కార్యదర్శి మారుతిబాబులను ఆదేశించారు.

రెడ్‌క్రాస్ సొసైటీ రక్త దాన శిబిరం

యడ్లపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపాలెం పరిధిలోనివిశ్వతేజ స్పిన్నింగ్ మిల్లు ప్రాంగణంలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గుంటూరు రెడ్‌క్రాస్ సొసైటీ వారు నిర్వహించిన శిబిరంలో కార్మికులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మిల్లు ఎండీ దాసరి చంద్రశేఖర్, జేఎండీ కే రమేష్, ఈడీ టీ రాజ, రెడ్‌క్రాస్ ప్రతినిధి షేక్ జానీ రసూల్, ఘంటా సీతయ్య, సీహెచ్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరుగులో కారుమంచి సైనికుడికి తృతీయస్థానం

కారుమంచి (శావల్యాపురం) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పఠాన్‌చెరువులోని గాడియం స్కూల్ స్టేడియంలో ఈ నెల 16, 17 తేదీల్లో నిర్వహించిన 24 గంటల స్టేడియం పరుగు పందెంలో శావల్యాపురం మండలం కారుమంచి గ్రామానికి చెందిన పూల అంకమ్మరావు ప్రతిభను కనబరచి తృతీయస్థానంలో నిలిచారు. అంకమ్మరావును గాడియం స్కూల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి రూ.15వేలు నగదు బహుమతితో పాటు ప్రశంశాపత్రాన్ని అందజేశారు. అంకమ్మరావు పూణేలో ఆర్మీ జవాన్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు.



అంకమ్మరావును మెడల్‌తో సత్కరిస్తున్న నిర్వాహకులు

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

● ఎంపీడీవో సీతారామయ్య

పోట్లూరు (శావల్యాపురం) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆధార్‌కార్డులలో తప్పులను సవరణ చేసుకునేందుకు, గతంలో ఆధార్‌కార్డు లేనివారు కొత్తగా ఆధార్‌కార్డులు పొందేందుకు ప్రభుత్వం ఆధార్ క్యాంపులను నిర్వహిస్తుందని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య తెలిపారు. మండలంలోని పోట్లూరు గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్‌ను ఎంపీడీవో మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 20న పోట్లూరు జడ్పీ పాఠశాలలో 21న వేల్పూరు జడ్పీ పాఠశాలలో, 22న వేల్పూరు-2 గ్రామ సచివాలయంలో ఆధార్ క్యాంపులు జరుగుతాయన్నారు. ఆధార్ క్యాంపులను ఆయా గ్రామాలలోని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొలంగట్లపై చెట్ల పెంపకంపై అవగాహన

పమిడిపాడు (నరసరావుపేట రూరల్), నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): అటవీయేతర ప్రాంతాల్లో, పొలాల గట్లపై విరివిగా చెట్లు నాటాలని ఉద్యానవన శాఖ అధికారి దాసరి నవీన్‌కుమార్ కోరారు. అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకం కార్యక్రమం నరసరావుపేట మండలంలో పమిడిమర్రులో మంగళవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన, శిక్షణ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రైతులకు అగ్రో ఫారెస్ట్రీ మీద అవగాహన, వ్యవసాయ భూమిలో మొక్కలు నాటితే వచ్చే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి రైతులకు అవగాహన కలిగించారు. కార్యక్రమం ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా (టీవోఎఫ్ఐ) ప్రోగ్రాం సీసీ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పమిడిమర్రు గ్రామ సర్పంచ్ దాసరి శ్రీనివాసరావు, యలమంద, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

21న కోటప్పకొండకు విధుశేఖరభారతి మహాస్వామి

నరసరావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయానికి శృంగేరి శారదాపీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి వస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి దాసరి చంద్రశేఖరరావు మంగళవారం తెలిపారు. భారతిస్వామి ఈ నెల 21వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు ఆలయానికి విచ్చేయుచున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 21వ తేదీ త్రికోటేశ్వరస్వామి మూలవిరాట్‌కు నిర్వహించే అభిషేకాలు నిర్వహించమని చంద్రశేఖరరావు తెలిపారు.

వరి పంటలో ఆకుముడత పురుగు నివారణపై అవగాహన

రావిపాడు (నరసరావుపేట రూరల్), నవంబరు 19: (ఆంధ్రజ్యోతి): వరి పంటలో వస్తున్న ఆకుముడత పురుగు నివారణకు రైతులు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు అవగాహన కలిగించారు. మండలంలోని రావిపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా రైతులు సాగుచేస్తున్న వరి పంటలను మండల వ్యవసాయ శాఖ అధికారి వి. నరేంద్రబాబు పరిశీలించి వరిపంటలో ఆకుముడత పురుగులను గుర్తించి రైతులకు నివారణ చర్యలపై అవగాహణ కలిగించారు. కార్యక్రమంలో వీఏఏలు డి.ఉమారాణి, సీహెచ్.లావణ్య, మల్లవరపు ఫ్రాన్సిస్, మెడబలిమి రాజేష్, రైతులు పాల్గొన్నారు.